ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
ఆగస్టు 21, 2016

నా పేరు కార్తీ

భూమి ఆవల మనిల్లు

ENTERED
KSR02B134 C

ఇలియానా



జాకీ చాన్‌తో సోనూ సూద్

హిందీ-చీనీ స్టార్ స్టార్

నేహా శర్మ

దేశ, భాషలు నటనకి అవరోధం కావని ఐష్, అమితాబ్, ప్రియాంక చోప్రాలు హాలీవుడ్ అరంగేట్రంతో రుజువుచేస్తే, నేటి బాలీవుడ్ తారల్లో కొందరు చైనీస్ సినిమాల్లో తళుక్కుమంటున్నారు. హాలీవుడే కాక రష్యన్, ఇటాలియన్, ఫ్రెంచ్ చిత్రసీమల్లో తమ సత్తా చాటుతామంటున్నారు. కథ, పాత్ర నచ్చితే పరదేశ చిత్రాల్లోనూ నటిస్తామంటున్నారు. 7వ శతాబ్దపు బౌద్ధ భిక్షువు, రచయిత, యాత్రికుడు జుయాన్‌జాంగ్ జీవితం ఆధారంగా తీసిన చిత్రం 'జుయాన్‌జాంగ్'. బాలీవుడ్ తారలు చైనీస్ చిత్ర సీమలో అడుగుపెట్టిన తొలి చిత్రం కూడా ఇదే. సోనూ సూద్, నేహా శర్మ అద్భుత నటన కనబరిచిన ఈ చిత్రం విడుదలకి సిద్ధంగా వుంది. నిర్మాణ దశని పూర్తి చేసుకుంటున్న మరో త్రిభాషా చిత్రం (ఇంగ్లీష్-హిందీ-మ్యాండరిన్)'కుంగ్ ఫు యోగా'. సోనుసూద్, అమీరా దస్తుర్‌తో పాటు ఇలియానా జాకీచాన్‌తో కలిసి నటించిన ఈ చిత్రం సోనమ్‌కి తెగనచ్చేసింది. కథ నచ్చితే భారతీయ చిత్రాలే కాదు ఖండాంతరాలు లేకుండా చైనీస్, ఫ్రెంచ్,రష్యన్ వంటి పరదేశ చిత్రాల్లో నటించేందుకు సై అంటున్నారు సోనంకపూర్ వంటి తారలు.

సోనమ్

అమీరా

ENTERED
KSR02B134

తమిళ చిత్ర సీమలో తండ్రి, అన్న నటులుగా ఓ ఇమేజ్ సృష్టించారు. మరి పక్కింటి కుర్రాడిలా ఉండే కార్తీక్ శివకుమార్ ఆ ప్రభావం నుంచి బయటపడి తనకంటూ సొంత ఇమేజ్ ఏర్పరచుకోగలడా? స్టార్ హీరో అవగలడా? అందుకే హీరో అవకాశాల్ని కాదనుకుని దర్శకత్వం వైపు ఆసక్తి చూపిస్తున్నాడేమో అనుకున్నారు. కార్తీక్ కూడా అలానే కెరీర్ ప్రారంభించాడు. అసిస్టెంట్ డైరెక్టర్‌గానే సినిమాల్లోకి ప్రవేశించాడు. కానీ ఇప్పుడు 'నా పేరు కార్తీ' అంటే కోలీవుడే కాదు టాలీవుడ్ కూడా ఆసక్తిగా గమనిస్తుంది. అతడి చిత్రాల్ని ఇరు చిత్ర సీమల ప్రేక్షకులు ఇష్టంగా చూస్తారు.



నా పేరు కార్తీ



కార్తీ అసలు పేరు కార్తీక్ శివ కుమార్. వెటరన్ నటుడు శివ కుమార్‌కు చిన్న కొడుకు. తమిళ్ అగ్ర నటుడు సూర్యకు తమ్ముడనే విషయం అందరికీ తెలిసిందే.

- చెన్నైలోనే పాఠశాల విద్య పూర్తయ్యింది. అక్కడే మెకానికల్ ఇంజినీరింగ్‌లో పట్ట భద్రుడయ్యాక . కొన్ని రోజులు ఇంజినీరింగ్ కన్సల్టెంట్‌గా చేశాడు. ఆదాయం బాలేదని పై చదువులపై దృష్టి పెట్టాడు.
- న్యూయార్క్ బింగ్హామ్టన్ విశ్వవిద్యాలయం స్కాలర్‌షిప్ సాధించి ఇండస్ట్రియల్ ఇంజినీరింగ్‌లో మాస్టర్స్ చేశాడు. అప్పుడే ఫిల్మ్ మేకింగ్ తరగతులకు హాజరయ్యాడు. పార్ట్ టైం గ్రాఫిక్ డిజైనర్‌గాను పనిచేశాడు.
- దర్శకుడవ్వాలానే ఆశయంతో భారత్‌కు తిరిగొచ్చిన కార్తీక్ మణి రత్నంను కలిశాడు. 'ఆయితా ఎజుతు' చిత్రంలో హీరోగా అవకాశాన్ని ఇస్తానంటే వద్దనుకుని ఆయన వద్దే అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేరాడు. ఆ పాత్రను సిద్ధార్థ్ చేశాడు.
- అలా చేస్తుండగానే 2007లో 'పరుత్తివీరన్' (మల్లిగాడు) సినిమాలో హీరోగా చేసే అవకాశం వచ్చింది. అప్పుడే స్క్రీన్ నేమ్‌ను కార్తీగా మార్చుకుని ప్రేక్షకులకు పరిచయమయ్యాడు. నిర్లక్ష్యంగా ఉండే ఓ పల్లె రౌడీగా ఆ చిత్రంలోని పాత్రకు జీవం పోశాడు. ప్రేక్షకుల అభిమానాన్ని దక్కించుకున్నాడు. ఉత్తమ నటుడిగా ఫిల్మ్‌ఫేర్ అవార్డును సొంతం చేసుకున్నాడు.
- నిదానంగానే కెరీర్‌లో కొనసాగినా చాలా జాగ్రత్తగా సినిమాల్ని ఎంచుకున్నాడు. దర్శకుడు సెల్వరాఘవన్ తొలుత 'ఇదు మాలై నెరతు మయక్కం' అనే కథతో కార్తీని కలిశాడు. తర్వాత ఆ ప్రాజెక్ట్ పక్కకు పెట్టి 'ఆయిరాతిల్ ఒరువన్' అనే ఫ్యాంటసీ చిత్రంలో హీరోగా అడిగాడు. అందులో కూలీగా, కీలక పాత్రధారుడిగా నటించి మెప్పించాడు కార్తీ. అదే తెలుగులో 'యుగానికొక్కడు'.'పైయా' (2010- ఆవారా), 'నాన్ మహాన్ అల్లా' (2010) (నా పేరు శివ), సిరుతాయ్' (2011- తెలుగు 'విక్రమార్కుడు'కి రీమేక్), బిరియానీ (2013), మద్రాస్ (2014), కొంబన్ (2015) చిత్రాల్లో నటించే అవకాశం అంత జాగ్రత్తగా ఉండటం వల్లే లభించింది.
- కెరీర్‌లో వరస ఫ్లాప్‌లను కూడా చూశాడు కార్తీ. 'అలెక్స్ పాండియన్', 'ఆల్ ఇన్ అజగు రాజా' అంతగా ఆదరణ పొందలేదు. 'కో' చిత్రంలో అతిథి పాత్రలో నటించాడు. కార్తీకి స్టార్‌డమ్ తెచ్చిపెట్టిన చిత్రం 'శగుని'.(శకుని తెలుగులో) ఈ సినిమా కార్తీ కెరీర్‌లో ఒక మైలురాయి.
- తెలుగులో 'యుగానికొక్కడు', 'ఆవారా', 'నా పేరు శివ', 'శకుని'గా చిత్రాలు డబ్ అయ్యి విజయం సాధించాయి. అన్న సూర్యకు సమానంగా తెలుగు అభిమానులను పొందాడు కార్తీ.
- నాగార్జునతో కలసి చేసిన 'ఊపిరి' తెలుగు ప్రేక్షకులకు మరింత చేరువ చేసింది. అది 'తోజా'గా తమిళ్‌లో విడుదలయ్యింది.
- ప్రస్తుతం 'కాష్మోరా' అనే హార్రర్ చిత్రంలో నటిస్తున్న కార్తీ మణి రత్నం ప్రాజెక్ట్ చేయబోతున్నాడు. 'కాష్మోరా'లో మూడు విభిన్న పాత్రల్ని చేస్తున్నాడు.
- 2011లో రంజిని చిన్నస్వామిని కార్తీ వివాహ మాడాడు. తర్వాత రెండేళ్లకు వారికి ఆడపిల్ల కలిగింది. ఉమయాల్‌గా పేరు పెట్టారు.

- కొప్పుసెట్టి దేవరాజు

వివరం..................3
చల్.. చలో...
విశేషం..............4
ఒలింపిక్ ప్రేమ జంటలు
కార్టూన్ పంచ్......... 5
వింత లోకం..........10
ఉంగరంలో గుండె లయ
స్ఫూర్తి........11
మన లేడీ కమాండో
కవిత్వమ్..............14
శ్రమ జీవితం

ఇండెక్స్

భూమి ఆవల మనిల్లు



అట్టమీది కథ...6

నా కళ్ళతో - 12
ప్రపంచయానంలో పదనిసలు

ప్రత్యేకం...................15
ఆయుష్షు పెంచే ఆట స్థలాలు
కథ 16
దులారీ
తెలుసా...................19
'గిన్నిస్'కూ రికార్డుంది
రుచి.....................21
కకోరి కబాబ్
బాల నేస్తాలు............23
వాల్ హ్యాంగింగ్స్
పద వికాసం.....
....24

ఆకట్టుకున్న 'వడగాలి'

మూడు నెలల బాలింత. బలహీనంగా వుండి కూడా శారమ్మ పిల్లల తిండీతిప్పల కోసం రోడ్డుపనికి వచ్చింది. రోడ్డు పనితో మంత్రిగారూ, కాంట్రాక్టరూ లాభం పొందారు. కులం వాళ్లు సౌకర్యాలు పొందారు. కానీ శారమ్మను తన బిడ్డకు పాలు ఇవ్వడానికి పంపనందు వల్ల బిడ్డ చనిపోయింది. శారమ్మ నష్టపోయింది. రచయిత మొలకపల్లి కోటేశ్వరరావు 'వడగాలి'ని తీవ్ర సుడి గాలుల్ని కాంట్రాక్టరుపైన,మంత్రిపైన వీచినట్టు కథను నడిపిస్తే కథ కొత్తగా ఉండేది. రామ తీర్థ రాసిన 'ప్రపంచానికి అణు ప్రమాదం' గొప్ప విజ్ఞానాన్ని అందించింది. దీన్ని చదివినవారు వామపక్షాలు మొదట యుపిఎకి ఎందుకు మద్దతుని వదులుకున్నాయో, వారి నిర్ణయం ఇప్పటికీ ఎంత సరియైనదో తెలుసుకోగలుగు తారు. మన దేశంలో అణువిద్యుత్ ప్లాంట్లు ఇంకా మూడు శాతంగానే ఉన్నాయి. సరైన ఉన్నత పరిజ్ఞానం లేకుండా అణువిద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తామనడం, 24 గంటలు విద్యుత్ అందిస్తామనటం ప్రజలను మభ్యపెట్టడమే అవుతుంది.

- ఇలిపిల్ల సూర్యనారాయణ, విజయవాడ

బాల మేధావి వైశాలి

అణ్వాయుధాలు కలిగి వున్నదేశాలు ఈ ఆయుధాలతో జరుపుకున్న యుద్ధాలు జననష్టం, ఇతర దేశాలకు దొంగిలించబడడం, వంటి విలువైన సమాచారం తెలుసుకున్నాం. పదేళ్ల చిన్నారి వైశాలి ఇంజినీరింగ్ ఎంట్రెన్స్ రాసి 90 శాతం మార్కులు తెచ్చుకోవడం, బిఇ, బిటెక్ విద్యార్థులకు ఉపన్యాసాలు ఇవ్వడం ఆశ్చర్య పరిచాయి. ఆమె మరింత ఖ్యాతి గడించాలని ఆశిస్తున్నాం. యుఎస్ ఉద్యోగాలు వద్దనుకుని ఇద్దరు ఇక్కడ వ్యర్థాలను రీసైకిల్ చేసే సంస్థను ప్రారంభించడం మంచి ఆలోచన. లక్షల నెల జీతం ఆఫర్‌ని వదులుకొని స్వదేశంలో అభివృద్ధికి కృషిచేస్తున్న ఆ నలుగురు ఇంజినీర్లకు అభినందనలు. ఒలింపిక్స్ సంబరాల కోసం 'రియో'ని సమాయత్త పరుస్తున్న తీరు ఉత్సాహపరిచింది. గతం కన్నా భారత్ ఎక్కువ పతకాలు సాధించాలని కోరుకుందాం. ఆర్థిక స్థోమత లేక మంచాన్నే భూమిదున్నే నాగలిగా వినియోగించి సాగు చేసుకున్న విటోబా ఎందరికో మార్గదర్శకుడు. తైవాన్‌లో జాలర్లు చేపలు పట్టే తాజా టెక్నిక్‌కి విస్తుపోయాం.

-టి. సత్యనారాయణ, విశాఖపట్నం

చదువుల వీధి

చదువుల వీధి పుస్తకాల నిధి శీర్షికన అందించిన వివరాలు నన్ను మిక్కిలి ఆకట్టుకున్నాయి. ఆ వ్యాసం చదివి ఎన్నో అరుదైన విషయాలు తెలుసుకున్నాం. గ్రంథాలయాల్లోనూ, కళాశాలల్లోనూ, విశ్వవిద్యాలయాల్లోనూ అందుబాటులో లేని పుస్తకాలు, 150 సంవత్సరాల ముందు ముద్రించిన అత్యంత అరుదైన పుస్తకాలు దొరకడం హర్షించదగ్గ విషయం.

-కై.వ నాగరాజు, అనంతపురం

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ.-520002.
మెయిల్ అడ్రస్: snehaweekly.praja@gmail.com

చల్.. చలో...



వివరం

మారథాన్ అంటే ఏక బిగిన ఓ 43 కి.మీ. నడిచేయడమేనా. మరి మన దేశంలోనే అత్యంత సుందరమైన, అతి కష్టమైన, పూర్తి పచ్చదనమైన, చాలా చల్లనైన అనే మాటెందుకు వస్తోంది. ఐతే అన్ని మారథాన్‌లు ఒకేలా ఉండవనేగా. రన్నర్‌లకు ఒక్కో సవాలు, ఒక్కో అనుభూతి అంటూ ఒక్కో మారథాన్‌లు చల్ చలోమంటున్నాయి. ఏటా సాగిపోయే ఈ మారథాన్‌ల గురించి కొన్ని వివరాలు...

ఓ నెల క్రితమే సోహ్రా–చిరపుంజి మారథాన్ రన్నర్‌లను మేఘాలయ అందాల్లో తిప్పేసింది. ఏడాదంతా వర్షం కురిసే ఈ ప్రాంతం ప్రకృతి అందాలతో తడిసిముద్దవుతుంది. ఇక్కడి పరుగు దాదాపు మేఘాలలోనే జరుగుతుందన్నట్టుగా ఉంటుందట. ప్రకృతి ప్రేమికులకు బహుమానమిది. విదేశీయులు కూడా వచ్చి పాల్గొంటారు. 13 స్థాయిల్లో జరిగే ఈ మారథాన్‌లో హాఫ్ మారథాన్‌లు, క్వార్టర్ మారథాన్‌లు కూడా ఉంటాయి.

అల్ట్రా అనుభూతి

ఇది అయిపోగానే కాలి పిక్కలు అల్ట్రా రన్ కోసం తీపులు తీశాయి కొందరికి. వారికి తోడుగా వందలాది మంది ఈ నెలలో దక్షిణాదిన జాదవు కొండల్లో 75 కి.మీ.ల గ్రీనెస్ట్ మారథాన్‌ను చుట్టొచ్చారు. గ్రీనెస్ట్ అంటే అంతా పచ్చగా కళకళలాడే ప్రకృతి అనే కాదు పర్యావరణ హితంగా కూడా అవగాహన కల్పించడం ప్రధానోద్దేశం. 50 కి.మీ., 25 కి.మీ.లు కూడా కాలు కదిపిన వారున్నారు. ఈ రెండిటి కంటే ముందుగా సీజన్‌ను ప్రారంభించింది సందాక్పు హిమాలయన్ మారథాన్. ఇంట్లో అతికించే సీనరీల్లా ఒక్కో అడుగులో ఎదురొచ్చే ఫ్రేముల్లో నిండిపోయి ఉండే ఆ ప్రాంతంలో పరుగు చాలా కష్టం. నాలుగు రోజుల పాటు నిర్వహించిన ఈ అల్ట్రా మారథాన్ దూరం 112 కి.మీ. మరి ఎవరెస్ట్, కాంచనగంగ, ల్హోట్సే, మకాలు శిఖరాలు ఒకే పరుగులో కనబడాలంటే ఆ మాత్రం దూరం వెళ్లాలి కదా.

ఇవన్నా మిస్సవ్వద్దు

అరెరే వీటిని మిస్సయిపోయామే అనుకునేవారికి సీజన్‌లో మిగిలిపోయిన కొన్ని గొప్ప మారథాన్‌లకు దారి ఇదే. కానీ అది చాలా కష్టంగా అడుగు పడేలా ఉంటుంది. ఎందుకంటే సెప్టెంబర్ 18న అత్యంత క్లిష్టమైన మారథాన్ జరగబోతోంది. కేవలం 7.5 కిలోమీటర్లే అని తేలిగ్గా తీసుకోడానికి అవకాశం లేకుండా మహారాష్ట్రలోని సతారా కొండ కోనల్లో సాగుతుందిది. పశ్చిమ కనుమల వంకీలు, అకస్మాత్తుగా అడ్డు నిలిచే ఎత్తులు, కిందకు పడేసేలా ఉండే లోయల్లో పరుగు దారుఢ్యానికి పరీక్ష పెడుతుంది. కొంతమంది ఔత్సాహికులు 2012లో ప్రారంభించిన ఈ మారథాన్ గతేడాది గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లోకి ఎక్కింది. ఒక కొండపై 2618 మంది రన్నర్‌లు మారథాన్ చేశారు మరి. ఇది కష్టమనుకుంటే మరో మారథాన్ నవంబర్‌లో ఉంది. అన్నింటి కంటే ఎక్కువగా చెమటలు పట్టించేంత స్పైసీగా ఉండే ఈ మారథాన్ మలబారు తీరంలో సాగిపోతుంది. విపరీతమైన ఉక్కపోతగా వాతావరణమున్నా కూడా కేరళ ప్రకృతి లోగిలి మిమ్మల్ని ఊరడిస్తుంది. అక్కడి నేల మెత్తదనం మిమ్మల్ని షూలు విసిరేసి పరుగుతీసే బేర్‌ఫూట్ రన్నర్‌గా మార్చేస్తుంది. నిదానంగా సాగిపోతూ మలయ మారుతాల్లో తేలిపోవడం ఖాయం.

మరో మైలు...

లేటెందుకు వేగంగా పూర్తి చేద్దామనుకుంటే గనుక ఢిల్లీలో వాలిపోవాలి. నవంబర్‌లోనే జరిగే ఈ హాఫ్ మారథాన్ దూరం కేవలం 6 కి.మీ.లే. దీన్ని గ్రేట్ ఢిల్లీ రన్ అని కూడా అంటారు. ఫిట్‌గా ఉండే అథ్లెట్లకే కాదు సామాన్యులు కూడా వేగంగా పూర్తి చేయొచ్చు. ఇక ఈ ఏడాది సీజన్‌ను సంతోషంగా పూర్తి చేసేందుకు వచ్చేసింది కొత్తగా కోల్‌కతా ఆనంద రన్. 25 కి.మీ.ల పరుగుతో పాటు, 10 కి.మీ., 5 కి.మీ.ల రన్ కూడా ఉన్నాయి. గతేడాది ఒలింపిక్ అథ్లెట్లు లలిత బాబర్, ఓపీ జైషా, సుధా సింగ్‌లతో పాటు 8,208 మంది పాల్గొన్నారు. సంతోషాల నగరంగా పిలుచుకునే కోల్‌కతా నగరంలో డిసెంబర్ నెలలో ఆనందంగా రన్ పూర్తి చేశాక వచ్చే ఏడాది అతిపెద్ద మారథాన్‌తో మొదలవబోతోంది.

వచ్చే ఏడాది జనవరి 15న జరిగే ముంబై మారథాన్‌లో 40 వేల మందికి పైగా పాల్గొనబోతున్నారు. ఫుల్ మారథాన్, హాఫ్ మారథాన్, డ్రీమ్ రన్‌లుండబోతున్నాయి. బోస్టన్ మారథాన్ గుర్తింపు పొందిన తొలి మారథాన్ ఈవెంట్ ముంబై మారథానే. పక్కా ప్లానింగ్‌తో వెళ్లండి. కుదిరితే ఓ కప్పు కొట్టండి.. లేకుంటే ఏ ప్రథమ బహుమతి ఇవ్వలేనంత అనుభూతిని బహూకరించుకోండి. 'చల్..చలో..చలో.. లైఫ్ సే మిలో.. ఇదో కొత్త చాప్టర్.... జస్ట్ సే హలో... చల్.. చలో.. చలో చలించు దారిలో.. ప్రతి ఒక్క చాలెంజ్ ఫేస్ చేయరో' పాట లైన్ బాగా నప్పుతోంది కదూ. మరెందుకు వేచి చూడటం జిందగీలో ఓ మారథాన్ చేసేయరో.

- అనంతోజు మోహనకృష్ణ

మిరుమిట్లు గొలిపే వెలుగుల్లో వేలాదిగా క్రీడాకారులు, ప్రేక్షకుల కోలాహలం మధ్య ఉత్కంఠంగా సాగే ఒలింపిక్స్‌లో విజయాలనేవి పోటీల్లోనే కాదు ప్రేమ కథల్లోను నమోదవుతున్నాయి. ప్రేమ ఎప్పుడు, ఎలా పుడుతుందో ఎవరికీ తెలీదు. అది తెలుసుకునే సమయానికే ఇరువురి మధ్య పరిచయం, స్నేహం పెరిగి, ప్రేమకి లేదా పరిణయానికి దారితీస్తుంది. ఒలింపిక్స్ వేదికగాను ఇదే జరుగుతోంది. పండగ వాతావరణాన్ని తలపించే ఒలింపిక్స్‌లో కొందరు క్రీడాకారులు పతకాలతో వెనుదిరిగితే మరికొందరు ప్రేమికులాగా మారి తమ జీవిత భాగస్వామిని పొందగలిగారు. పేరొందిన క్రీడాకారుల మధ్య ప్రేమ చిగురించడానికి దశాబ్దాల నుండి ఒలింపిక్స్ వేదికలుగా మారాయి.



క్విన్ - హి జీ

ఒలింపిక్ ప్రేమ జంటలు

గతవారం చైనాకు చెందిన డైవింగ్ క్రీడాకారిణి హి జీ, ప్రియుడు సింక్రనైజ్ స్ప్రింగ్ డైవర్ క్విన్ ఒలింపిక్ వేదిక దగ్గర రింగ్ తొడిగి పెళ్లి తంతులో డైవ్ చేశాడు. ఆరేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఇద్దరూ ఈ ఒలింపిక్స్‌లో పతకాలు సాధించేసరికి ఇదే సరైన సమయమని భావించి ఒక్కటయ్యారు. ఇలాంటి జంటలు మరికొన్ని ఉన్నాయి.

రోజర్ ఫెదరర్ -మిరోస్లేవా (మిర్కా) వాన్రినిక్

రోజర్, మిర్కా ఇద్దరూ స్విట్జర్లాండ్ టెన్నిస్ జట్టు సభ్యులు. 1997లో బీల్‌లోని స్విస్ టెన్నిస్ టెక్నికల్ సెంటర్‌లో తొలిసారిగా మిర్కాను కలిశాడు ఫెదరర్. అప్పటి నుండి తనే మిర్కాతో ఎక్కువగా మాట కలిపేవాడు. 15 ఏళ్ల క్రితం సిడ్నీలో నిర్వహించిన ఒలింపిక్స్‌లో మిర్కాకు ప్రతి టోర్నమెంట్‌లో ధైర్యాన్నందిస్తూ తనకెంతో సన్నిహితంగా ఉండేవాడు. ఆ సమయంలో ఒలింపిక్స్‌లో క్వార్టర్స్‌కి చేరుకున్నాడు ఫెదరర్. పురుషుల సింగిల్స్ సెమీస్‌కి మాత్రం చేరుకోలేకపోయాడు. మహిళల డబుల్స్‌లో మిర్కా కూడా రెండో రౌండ్‌లోనే ఓటమి చవిచూసింది. పోటీల్లో పరాజయం పొందినా జీవితంలో ఒక్కటవ్వాలని 2000 సెప్టెంబర్ 27న ఒలింపిక్ మైదానంలో ఇద్దరూ చేసుకున్న బాసలు వారికి ఓటమి బాధని తగ్గించాయి. ఈ స్విస్ జంట ఏడేళ్ల తర్వాత 2009 ఏప్రిల్‌లో వివాహ బంధంతో ఒక్కటయ్యింది.

రోజర్ ఫెదరర్ మిరోస్లేవా

ప్రేమ పోటీలు

రొమేనియాకి చెందిన నాదియా కమానెసికి బార్ట్ కానర్‌తో తన టీనేజ్‌లో పరిచయం ఏర్పడింది. 14 ఏళ్ల వయసులో మాంట్రియల్ ఒలింపిక్స్‌లో పాల్గొంది నాదియా. అమెరికాకు చెందిన బార్ట్ కానర్‌కి 18 ఏళ్లు. 1976లో మాంట్రియల్ ఒలంపిక్స్ జిమ్నాస్టిక్స్‌లో వెండి పతకాన్ని గెలుచుకున్నారిద్దరూ. ఆ ఆనందాన్ని పంచుకుంటున్న సమయంలో ఉన్నట్టుండి ఓ ఫోటోగ్రాఫర్ ఫోటో పోజ్ కోసం నాదియాని ముద్దాడమంటూ బార్ట్‌కి సైగ చేశాడు. ఫోటో పోజ్ కోసం నాదియాని ముద్దాడినా తర్వాత అది టీవీ ఛానెళ్లలో సంచలన వార్తగా మారింది. జీవితంలో ఎన్నో క్లిష్ట పరిస్థితులని ఎదుర్కున్న నాదియాకి తోడుగా నిలిచాడు బార్ట్ కానర్. 1991లో ఇరువురి మధ్య ప్రేమ చిగురించడంతో 1994లో ఆమ్‌స్టర్‌డామ్‌లో నాదియాతో తన మనసులో మాటని పంచుకొని పెళ్లికి అంగీకారాన్ని పొందాడు బార్ట్ కానర్.

మహమ్మద్ అలీ ప్రేమ కథ కూడా..

1960లో రోమ్‌లో జరిగిన ఒలింపిక్స్‌లో అమెరికన్ స్ప్రింటర్ విల్మా రుడాల్ఫ్‌పై మనసు పారేసుకున్నాడు బాక్సింగ్ ఛాంపియన్ మహమ్మద్ అలీ. ఈ విషయాన్ని రుడాల్ఫ్‌కి చెప్పడానికి జంకడంతో అది ఒక పుకారుగా మిగిలిపోయింది. దశాబ్దాల తర్వాత రుడాల్ఫ్‌తో తన మనసులో మాట బైటపెట్టాడు అలీ. ఇంగ్లాండ్‌కి చెందిన హగ్ పోర్టర్ 16వ ఏట వల్వేర్‌హాంప్టెన్ సైక్లింగ్ క్లబ్‌లో జూనియర్స్ విభాగంలో చేరి మొదటి పోటీలోనే మూడో స్థానంలో నిలిచాడు. 1958లో సీనియర్స్ విభాగంలో నిర్వహించిన పలు సీజనల్ సైక్లింగ్ పోటీలతో పాటు ఎన్నో జాతీయ స్థాయి పోటీల్లో విజేతగా నిలిచిన హంగ్ పోర్టర్‌కి 1964 ఒలింపిక్స్ నిరాశే మిగిల్చాయి. 19 ఏళ్లకే 200 మీ. బ్రెస్ట్ స్ట్రోక్‌లో బ్రిటన్‌కి బంగారు పతకాన్ని సాధించిపెట్టిన స్విమ్మర్ అనితా లోహాన్స్‌బర్గ్.


హంగ్‌పోర్టర్
అనితా లోహాన్స్‌బర్గ్

1964లో టోక్యోలో జరిగే వేసవి ఒలింపిక్స్‌కి ప్రయాణమైన లోహాన్స్‌బర్గ్‌కి ఫ్లేన్‌లో పరిచయమయ్యాడు హంగ్ పోర్టర్. ఆ పరిచయం ప్రేమకి నాంది పలకడంతో 1965లో ఈ క్రీడాకారులిద్దరూ వివాహం చేసుకున్నారు. 2004 ఏథెన్స్ ఒలింపిక్స్‌లో చెక్ రిపబ్లిక్ షూటర్ క్యాటెరీనా ఎమ్మోన్స్, అమెరికాకు చెందిన రైఫిల్ షూటర్ మాథ్యూ ఎమ్మోన్ ప్రేమికులుగా మారారు. షూటింగ్ విభాగంలో పతకాలు సాధించడంలోనే కాదు ఒక్కటవ్వాలనుకున్న తమ కలల్ని సాకారం చేసుకోవడంలోనూ ఇరువురూ దిట్టలే అని రుజువు చేసుకున్నారు. యూరప్, అమెరికాకు చెందిన ఎందరో అథ్లెట్లతో పాటు ఖండాంతరాలు దాటిన ప్రేమ చిగురించడానికి ఒలింపిక్స్ వేదికగా మారాయి.

నవ్వుల్ - పువ్వుల్



ఎంతవారలైనా.....

"అమ్మా....కొంచెం కూర ఉంటే పెట్టు తల్లీ"
"చూడ్డానికి దిట్టంగా ఉన్నావు..కష్టపడి బతకొచ్చుగా?"
మీరు ఇంత అందంగా ఉన్నారు...సినిమాల్లో నటించవచ్చుగా...
"ఉండు ఇంట్లో మటన్ బిర్యాని ఉంది పెడతాను."

ముల్లును ముల్లుతోనే...

ఇదేమిటయ్యా...! అరికాలి నిండా ఇన్ని ముళ్లెలా గుచ్చుకున్నాయ్....!
"మొదట ఒక ముల్లే గుచ్చుకుంది డాక్టర్..! కాని ముల్లును ముల్లుతోనే తీయాలనే ప్రయత్నించడంతో ఇలా అయింది."

తాళం



"బావ...ఏంటి ఈ టైమ్‌లో బయట తిరుగుతున్నావ్....."
"మీ అక్క....పాట పాడుతాను తాళం వెయ్యమంది. తను పాట మొదలుపెట్టగానే నేను తాళం వేసి బయటకొచ్చాను బావ..."

వైద్యం



"పది మంది ఉన్న గుంపులోకి వెళ్తే చాలు చేతులు వణికిపోతున్నాయ్ డాక్టర్ గారూ..." అన్నాడో పేషెంట్...
"దాందేముందిలెండి... గుంపులోకి వెళ్ళడం మానేస్తే సరి.."అన్నాడు డాక్టర్.
"అదెలా కుదురుతుంది డాక్టర్..? నేను జేబు దొంగని కదా...!" అన్నాడు పేషెంట్.

స్లిప్పులు

" పరీక్ష రాయకుండా ఏడుస్తున్నావేంటి బాబు?" అడిగాడు ఇన్విజిలేటర్
"నేనే కష్టపడి రాసి తెచ్చుకున్న స్లిప్పులు ఎవరో కొట్టేశారు." అని రాగమందుకున్నాడు విద్యార్థి...

లిప్ స్టిక్

రాజు: ఏంట్రా చింటూ... అమ్మ అలా సైలెంట్‌గా కూర్చుంది ఏంజరిగింది.
చింటు: ఏం లేదు నాన్నా.. అమ్మ లిప్స్టిక్ తీసుకు రమ్మంది. నేను ఫెవిస్టిక్ ఇచ్చా... అంతే.

మాతృభాష

చంటి: మనం మాట్లాడే భాషని మాతృభాష అని ఎందుకంటారు నాన్నా!
నాన్న: నాన్నలకు మాట్లాడే అవకాశం లేదని అప్పుడే డిసైడ్ చేశారు కాబట్టి

తీసుకెళ్లిపోయారు

మంజు: ఏంటి రాధా బస్‌లో వస్తున్నావ్ నీ బైక్ ఏమైంది
రాధ: బ్యాంకు లోన్ తీసుకుని బైక్ కొనుకున్నా. వాయిదాలు సరిగా కట్టకపోయేసరికి బైక్‌ని తీసుకెళ్లిపోయారు.
మంజు: అరే ఇదేదో కాస్త ముందు తెలిస్తే బాగుండేదే
రాధ: ఎందుకు
మంజు: నా పెళ్ళికి లోన్ తీసుకునేదాన్ని



భూమి ఆవల మనిల్లు

ఆ ఇంట్లో చందమామనే కాదు, భూమి తల్లిని కూడా చూపిస్తూ గోరు ముద్దలు తినిపించొచ్చు. భూమ్మీద కాకుండా భూమికి ఆవల మనం కట్టుకున్న ఒకే ఒక ఇల్లు అది. ఆ ఇల్లు ఒక్క రోజులో 15-16 సూర్యోదయాల్ని, సూర్యాస్తమయాల్ని చూస్తుంది. భూమి చుట్టూతా తిరుగుతూ ప్రతి సముద్రాన్ని, ప్రతి ఖండాన్ని పలకరిస్తుంది. అలాంటి పలకరింపులు లక్ష దాటిపోయాయి. ఆ ఇల్లే ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్ (ఐఎస్ఎస్). అంతరిక్షంలో కట్టుకున్న మానవ నివాస నిర్మాణం, మ్యాన్డ్ ల్యాబ్ ఇది. భూమ్మీద కాకుండా విశ్వాంతరాళంలో మనకున్న ఒకే ఒక ఒంటరి గూడు కూడా ఇదే. భూ కక్ష్యలో తిరుగుతూ ఎన్నో శాస్త్ర పరిశోధనలకు వేదికైన ఐఎస్ఎస్ విజయవంతంగా లక్షో సారి భూగోళాన్ని చుట్టిన సందర్భంగా భూమి ఆవల ఉన్న మనిల్లు గురించే ఈ వారం అట్ట మీది కథ.

- డా. కాకర్లమూడి విజయ్

ఆకాశంలో అతి పెద్ద మానవ నిర్మిత పరిశోధన శాల అయిన ఐఎస్ఎస్ మొన్న మే పదహారున భూమి చుట్టూ లక్ష ప్రదక్షిణలు పూర్తి చేసుకుంది. మీరు ఇది చదివే సమయానికి మరో పదిహేను వందల ప్రదక్షిణలు చేసి వుంటుంది. ఈ రోదసీ ప్రయోగశాల అప్పటికీ (మే 16కి) 17 ఏళ్ళుగా 2.6 బిలియన్ (260 కోట్ల) మైళ్ళు ప్రయాణించింది. గంటకు 17,500 మైళ్ళ వేగంతో (అంటే సెకనుకు అయిదు మైళ్ళు) ప్రతి గంటన్నరకి ఒకసారి భూమి చుట్టూ ప్రదక్షిణం చేసే ఈ సూక్ష్మ గురుత్వాకర్షణ ప్రయోగశాలలో నిత్యం కొందరు

పరిశోధకులు నివాసం వుంటారు.

అంతరిక్షంలోనే జత చేస్తూ..

ఆగిపోయిన అమెరికా స్పేస్ స్టేషన్ 'ఫ్రీడమ్', రష్యా 'మీర్' ప్రాజెక్టుల నుండి ఐఎస్ఎస్ ఆవిర్భవించింది. 'ఫ్రీడమ్' అనే పేరుతో నాసా ఒక అంతరిక్ష ప్రాజెక్ట్ ఆరంభించింది. అనుకోని కారణాల వల్ల అది ముందుకు సాగలేదు. కానీ ఆ ఆలోచన క్రమేపీ రోదసిలో మానవ నివాసమనే ఆలోచనగా మారి ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్(ఐఎస్ఎస్) అనే ఓ అసాధ్యమైన కలను నిజం చేసుకునే దుస్సాహసమైన ప్రాజెక్ట్‌గా పరిణామం చెందింది. అంత భారీ నిర్మాణం భూమి మీద చేసినా, దాన్ని రోదసిలోకి మోసుకెళ్లే వీలు లేదు. అంతరిక్షంలోకే విడి విడిగా భాగాల్ని తీసుకెళ్లి అక్కడే జతచేయాలి. ఇది ఊహకు రావడానికే ఎంతో ఆలోచన కావాలి. అది నిజం కావడానికి ఎంతో మేధ కావాలి. అందుకే దశాబ్దంలోపు చేద్దామనుకున్నా దశాబ్దంపై నాలుగేళ్లకు స్వప్నం రూపుదాల్చింది. 1998 నవంబర్ 20 కజకిస్తాన్‌లోని బైకనూర్ నుండి రష్యన్ ప్రోటాన్ రాకెట్ 'జార్యా' అనే మాడ్యూల్‌ను తీసుకుని అంతరిక్షంలోకి దూసుకుపోయింది. అంతరిక్షంలో ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్ అనే మహా నిర్మాణానికి మొట్ట మొదటి విడిభాగమే జార్యా. ఆ విడి భాగాన్ని అమెరికా నిధులతో రష్యా తయారు చేసింది. మానవాళి అంతవరకూ చూడని ఒక మహా అద్భుత ఆవిష్కారం ఆరంభమయ్యింది.

మరో రెండు వారాల తరువాత 1998 డిసెంబర్ 6న అమెరికా స్పేస్‌షటిల్ ఎండీవర్ అమెరికాలోనే నిర్మించిన 'యూనిటీ' అనే రెండవ భాగాన్ని తీసుకుని వెళ్లి దాన్ని జార్యాతో అంతరిక్షంలోనే జత చేసింది.

జార్యా యూనిటీ మాత్రమే వున్న ఐఎస్-ఎస్‌కు క్రమ క్రమంగా అనేక ఇతర విడి భాగాలను భూమి నుండి తీసుకెళ్లి అంతరిక్షంలో అమర్చడం మొదలైంది. అలా స్పేస్ స్టేషన్ నిర్మాణం పూర్తి కావడానికి దాదాపు నలభై అంతరిక్ష యాత్రలు అవసరమయ్యాయి. రష్యా మొత్తం 7 మాడ్యూళ్లను, అమెరికా 6 మాడ్యూళ్లను, జపాన్ రెండింటిని, యూరప్ ఒక మాడ్యూల్‌ని రూపొందించి పంపాయి. ప్రస్తుతం మొత్తానికి ఐఎస్ఎస్‌లో 100కు పైగా విడి భాగాలున్నాయి. అంతర్జాతీయ సహకారం ద్వారా ఎటువంటి అసామాన్య అద్భుతం సాధించవచ్చో ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్ నిరూపించింది. భూమి మీద అనేక విడి భాగాల ప్రణాళికలు వేసి వాటిని దశల వారీ నిర్మించి అంతరిక్షంలోకి పంపించి అక్కడ అప్పటికే ఉన్న వాటితో


రోబోటిక్ ఆర్మ్‌తో వ్యోమగామి

అనుసంధానించి ఆ అంతరిక్ష పరిశోధన కేంద్రాన్ని మానవుల నివాసానికి అనుకూలంగా రూపొందించడంలో మానవ మేధ, అనేక దేశాల సహాయ సహకారాలు సమన్వయాలు అమోఘం. ఐఎస్ఎస్ నిర్మాణ, నిర్వహణలో అమెరికా, కెనడా, జపాన్, రష్యా ఫెడరేషన్‌తోబాటు బెల్జియం, డెన్మార్క్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, నెదర్లాండ్, నార్వే, స్పెయిన్, స్వీడన్, స్విట్జర్లాండ్, యునైటెడ్ కింగ్‌డమ్ మొదలైన 11 సభ్య దేశాలు పాలుపంచుకుంటున్నాయి.

శూన్యంలోనే పని

అంతరిక్షంలో నిర్మాణం చెప్పుకున్నంత సులభం కాదు. నేల మీద గానీ, నీటి మీద గానీ పరికరాలని రవాణా చేసి, గట్టి భూమి మీద వాటిని కలిపి ఒక నిర్మాణం చేపట్టడం పెద్ద కష్టమైన పనికాదు. కానీ భూమికి కొన్ని మైళ్ళ ఎత్తులో కాలు మోపే, గాలి పీల్చే వీలు కూడా లేని శూన్య ప్రదేశంలోకి భారీ విడి భాగాలను తరలించడం అక్కడే వాటిని అతికించడం అవన్నీ సక్రమంగా పనిచేసేలా నిర్ధారించుకోవడం ఊహకు కూడా అందని ఆలోచన. ఐఎస్ఎస్ ప్రాజెక్టు తొలి నుండి అనేక అవాంతరాలకు ఎదురీదింది. 80వ దశకంలో నిధుల కోత, పెరిగిన అంచనాల కారణంగా ప్రాజెక్టు సుదీర్ఘ కాలం ఆలస్యమైంది. ఈ ప్రాజెక్టుని ఆపేయడానికి 1993లో చట్ట సభలో ఓటింగ్ పెట్టారు. కానీ కేవలం ఒకే ఒక్క ఓటుతో ఆ ప్రతిపాదన వీగిపోయింది. దాదాపు 6 లక్షల కోట్ల రూపాయల ఖర్చుతో 361 అడుగుల పొడవు, 4 లక్షల 19 వేల 600 కిలోల బరువున్న ఈ స్టేషన్, భూమికి సుమారు 360-435 కి.మీ. ఎత్తులోని కక్ష్యలో తిరుగుతుంది. అది ప్రతి 90 నిమిషాలకి ఒకసారి చొప్పున రోజుకి 15.54 సార్లు భూమి చుట్టూ ప్రదక్షిణం చేస్తుంది. దాని వేగం గంటకు 28,000 కి.మీ. అంటే ఐఎస్ఎస్‌లో వున్న వారు రోజుకి 15-16 సూర్యోదయాలూ, సూర్యాస్తమయాలూ చూస్తారన్న మాట. మానవులు ప్రవేశించడానికి అనువుగా నిర్మాణం పూర్తి కావడానికి దాదాపు రెండేళ్ళ సమయం పట్టింది.

పెద్ద ఇల్లంత...

ఈ రోదసి నిలయంలో ఓ కుటుంబం నివసించడానికి విశాలమైన ప్రదేశమే ఉంది. సుమారు అయిదారు బెడ్ రూమ్‌ల ఇంటి పరిమాణం అంత ప్రదేశంలో మనుషులు, యంత్రాలు ఉండవచ్చు. విలియం షెపర్డ్, సర్జీ క్రికలేవ్, యూరి గిడ్జెంకో అనే ముగ్గురు అంతరిక్ష పరిశోధకులు తొలిసారి 2000 నవంబర్ 2న స్టేషన్‌లో అడుగు పెట్టారు. అప్పటి నుండి ఈనాటి వరకు స్టేషన్‌లో మనుషులు లేకుండా లేదు. 2000 అక్టోబర్ 31న స్టేషన్‌కి తొలిసారి

ఎప్పుడు? ఎంతమంది?

సునీతా విలియమ్స్

తొలి విడత ముగ్గురు వెళ్ళినా ఆ తరువాత 7వ అంతరిక్ష యాత్ర నుండి ఇద్దరేసి వెళ్ళేవాళ్ళు. మళ్ళీ 11వ యాత్ర నుండి 13వ యాత్ర వరకూ ముగ్గరేసి వెళ్ళారు. 14వ యాత్రలో ఐదుగురు వెళ్ళారు. అందులో సునీతా విలియమ్స్ కూడా వుంది. ఆమె మరో రెండు సార్లు 32, 33వ యాత్రలలో కూడా పాల్గొన్నారు. 16వ సారి ఏడుగురు వెళ్ళారు. 20వ సారి ఎనిమిది మంది వెళ్ళారు.

సాధారణంగా సిబ్బంది ఐదున్నర నెలల పాటు వుంటారు. కానీ 20వ సారి వెళ్ళిన వాళ్ళు మాత్రం 7 నెలలు ఉన్నారు. 42, 43వ యాత్రల్లో వెళ్ళిన వారు 199 రోజులు ఉన్నారు. 43వ యాత్రలో వెళ్ళిన స్కాట్ కెల్లీ, మిఖాయిల్ కోర్ని ఎంకోలు మాత్రం (మరో మూడుసార్లు సిబ్బంది వచ్చినా) 340 రోజులు అక్కడే ఉన్నారు.

ఇప్పటి వరకూ 18 దేశాల నుండి 224 మంది 382 ప్రయాణాలలో ఐఎస్ఎస్‌కి వెళ్ళారు. వారిలో కొంత మంది రెండు, మూడు, నాలుగు సార్లు వెళ్ళిన వాళ్ళు ఉన్నారు. ఇప్పటికి మొత్తం 34 మంది మహిళలు వెళ్ళారు.

ప్రస్తుతం స్టేషన్‌లో ఆరుగురు (జెఫ్ విలియమ్స్, అలెక్సీ ఒవ్చినిన్, ఒలేగ్ స్క్రిపోచ్కా, అనతోలీ ఇవనిషిన్, కేట్ రూబిన్స్, తకుయా ఒనిషి) వున్నారు. వీళ్ళు 170 రోజులు వుండే అవకాశం ఉంది.

ప్రయాణ సమయం ఎంత?

మామూలుగా భూమి నుండి ఐఎస్ఎస్‌కి సుమారు రెండు రోజుల ప్రయాణం కానీ మూడేళ్ళ క్రితం నుండి సోయిజ్ కేవలం ఆరు గంటలలోపే ఐఎస్ఎస్‌కి చేరుతోంది. శక్తివంతమైన ఇంజిన్లు మెరుగైన టెక్నాలజీ కాదు గానీ మెరుగైన మార్గ ప్రణాళిక వల్ల ప్రయాణ సమయం భారీగా తగ్గింది. ఇప్పుడు నాలుగు ప్రదక్షిణల మార్గం ఉంది. దాన్ని ఇంకా కుదించి రెండు ప్రదక్షిణలతోనే చేరే మార్గం ఆలోచిస్తున్నారు.

పర్యాటకులు కూడా

ఐఎస్ఎస్‌ను కేవలం అంతరిక్ష పరిశోధకులు, శాస్త్రవేత్తలు మాత్రమే కాదు పర్యాటకులు కూడా సందర్శించారు. డెన్నిస్ టిటో అనే కాలిఫోర్నియా వ్యాపారవేత్త 2001 ఏప్రిల్ 28న సోయుజ్ అంతరిక్ష నౌకలో స్టేషన్‌కి ప్రయాణమయ్యాడు. అందుకు దాదాపు 20 మిలియన్ డాలర్ల సొంత డబ్బు ఖర్చు పెట్టాడనుకోండి. ఇప్పటికి మొత్తం ఏడుగురు పర్యాటకులు ఐఎస్ఎస్‌కి వెళ్ళి వచ్చారు. మైక్రోసాఫ్ట్ ఆఫీస్ సాఫ్ట్‌వేర్ ఆవిష్కర్త చార్లెస్ సిమోన్యి రెండు సార్లు వెళ్లి వచ్చాడు.

ఎవరు వెళ్తున్నారు?

ఇప్పటికి రెండు వందలకుపైగా ఐఎస్ఎస్‌కి వెళ్లారు. వారిలో 18 దేశాల వాళ్ళున్నా సగానికి పైగా నాసా ఆస్ట్రోనాట్‌లే ఉన్నారు. వెళ్ళిన వారిలో 72 శాతం మంది మాస్టర్, లేదా పిహెచ్‌డి లేదా ఎమ్‌డి డిగ్రీ వున్న వాళ్ళు. సగానికి పైగా పైలట్‌లే. వెళ్ళిన వారిలో 34 మంది మహిళలు. వెళ్ళిన వారం దరి సగటు వయసు 41 సంవ త్సరాలు అతి తక్కువ వయసు 31, అత్యధిక వయసు 63.

మనుషులని తీసుకుని వెళ్ళి, తిరిగి 2001 మార్చ్ 21న వారిని భూమికి దింపింది స్పేస్ షటిల్. అప్పటి నుండి ఇప్పటి వరకూ 48 సార్లు మనుషులను తీసుకెళ్ళి తీసుకురావడం జరిగింది.

రష్యా అంతరిక్ష నౌకలో...

ప్రస్తుతం అమెరికా స్పేస్ షటిల్ ప్రోగ్రాం లేదు. అది 2011లో ఆపివేయబడింది. దానిలో మామూలు విమానంలో మాదిరి అంతరిక్షంలోకి వెళ్ళి వచ్చేవారు. ఇప్పుడు అమెరికన్ వ్యోమగాములు కూడా రష్యన్లు రూపొందించిన 'సోయుజ్' అంతరిక్ష నౌకని సిబ్బంది, ఆహారం, పరికరాల రవాణాకి వాడుతున్నారు. ఒక్కో ప్రయాణానికి ఒక్కొక్కరికి దాదాపు 71 మిలియన్ డాలర్లు ఖర్చు. సోయుజ్ మరీ చిన్నగా వుండి విపరీతమైన కుదుపులు ఉంటాయని అందులో ప్రయాణించిన వాళ్ళు చెబుతారు. ఐఎస్ఎస్ వరకూ రవాణాకు ఇకపై సోయుజ్‌ని ఇవ్వడం వీలుకాదని రష్యా అమెరికాకి చెప్పింది. అందుకే అమెరికా ఇప్పుడు కొన్ని ప్రైవేటు కంపెనీలతో సంప్రదింపులు జరుపుతోంది. కనీసం 2017కైనా తమ సొంత గడ్డ నుండి ఐఎస్ఎస్‌కి రాకపోకలు జరపాలని అనుకుంటుంది.

అంత సులభం కాదు

ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్‌లోకి వెళ్ళడానికి చాలా భారీ ప్రణాళికే ఉంటుంది. స్టేషన్‌లోకి వెళ్ళే అభ్యర్థికి దాదాపు మూడేళ్ల ముందు నుండి అనేక శిక్షణ కార్యక్రమాలు జరుగుతాయి. అమెరికాలోని టెక్సాస్, హూస్టన్‌లో ఉన్న నాసా జాన్సన్ స్పేస్ సెంటర్‌లో వాస్తవ పరిమాణంలో రెండు ఐఎస్-ఎస్ నమూనాలు ఉన్నాయి. వాటిలో ఒకటి 6.2 మిలియన్ గేలన్ల నీరు, 20 అడుగుల న్యూట్రల్ బోయన్సీ ల్యాబ్ అనే కొలనులో ఉంది. ఆ నమూనాలో ప్రవేశించే ముందు తరగతి గదులలో పాఠాలు వినాలి. అంతరిక్ష నౌకలు, రాకెట్లు, ఐఎస్ఎస్ ప్రయాణ, నివాస, నిర్వహణ సాధక బాధకాలు, సవాళ్ళు, సమస్యలు, పరిష్కారాలు అన్నీ కూలంకుషంగా వివరిస్తారు. నేర్పిస్తారు. నైపుణ్యం కలిగిస్తారు. ఇప్పుడు రష్యా నుండి ప్రయాణం జరుగుతుంది. కాబట్టి తరుచూ రష్యాలోని స్టార్ సిటీ (మాస్కో దగ్గర) వెళ్ళి యూరీ గగారిన్ కాస్మోనాట్ ట్రైనింగ్ సెంటర్‌లో రష్యన్ భాష కూడా నేర్చుకోవాలి. రెండు దేశాల మధ్య ఇలా ఎనిమిది నుండి పది ట్రిప్పులు వుంటాయి.

ఇక న్యూట్రల్ బోయన్సీ ల్యాబ్‌లో శిక్షణ అత్యంత కఠినమైనది. ఇందులో క్లిష్టమైన స్పేస్ వాక్, శూన్యంలో నిలబడి యంత్ర భాగాలు బిగించడం, నీటిలో తలకిందులుగా ఆరేసి గంటలు వేలాడుతూ పరికరాలను ఉపయోగించడం నేర్పుతారు. అవి కింద పడకూడదు! ఇటువంటి సుదీర్ఘమైన, క్లిష్టమైన, కఠినమైన, విశిష్టమైన తర్ఫీదులో నమ్మకంగా విజయం పొందిన తరువాతే ఆ అభ్యర్థి కొన్ని రోజుల పాటు ఐఎస్ఎస్‌లో ఉండే అవకాశాన్ని పొందుతాడు.

రోదసిలో పూలూ, కూరగాయలు..

అంతరిక్షంలో దీర్ఘకాలం పాటు ఉండాల్సి వస్తే ఆహార సమస్యలు రాకుండా ఏం చేయవచ్చు అనే దిశలో చేసిన ప్రయోగం 'వెజ్జీ'. అక్కడి పరిశోధనలు అంతరిక్షంలో వ్యవసాయం చేయగలమని నిరూపించాయి. 39వ ప్రయాణంలో వెళ్ళిన సిబ్బంది 'వెజ్జీ' మొక్కలు పెంచే వ్యవస్థను ఆరంభించారు. చిన్న చిన్న దిండ్ల వంటి ప్లాంట్ పిల్లోలలో కూరగాయల విత్తనాలు అమర్చి ఉంటాయి. వాటికి 100 మిల్లీ లీటర్ల నీరు అందించి అవి మొలకెత్తే విధంగా చేస్తారు. అలా పండించిన లెట్యూస్ ఆకులని గతేడాది పరిశోధకులు తిన్నారు కూడా. మొన్న ఫిబ్రవరి పద్నాలుగున ఇదే పద్ధతిలో జినియా పూలను కూడా పూయించారు.



శరీరంపై ప్రభావం

దాదాపు ప్రతి వ్యోమగామికి స్పేస్ సిక్‌నెస్ ఎదురౌతుంది. తల తిప్పినట్టు ఉండటం, వాంతి కావడం వంటివి మామూలే. ఆ వాతావరణంలో వెన్నెముక సాగి ఒక అంగుళం పొడవవుతారు. మొహం వాచినట్టు ఉబ్బి ఉంటుంది. కొందరికి కళ్ళలో మెరుపులు కనిపిస్తాయి. ఎముకలలోని కాల్షియం తరిగి పోతుంది. తరచూ మానసిక వైద్యులతో మాట్లాడవలసిన అవసరం వస్తుంది.

అసలేం చేస్తారు

ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్ లక్ష్యాలు చాలా ఉన్నాయి. వేలాది ప్రయోగాలు నిత్యం స్టేషన్‌లో జరుగుతూనే ఉంటాయి. వైద్య, వ్యాధి సంబంధ ప్రయోగాలు, నూతన పదార్థాల అభివృద్ధి వంటివి ముఖ్యమైనవి. ఆస్టియో పోరోసిస్ వ్యాధిని ఎదుర్కొనేందుకు వాడే వైద్య విధానాలలో మార్పు అవసరమని తెలిసింది. అలాగే అంతరిక్షంలో కొన్ని రకాల బాక్టీరియమ్‌లు అధికంగా అభివృద్ధి చెందుతాయని అంతకు ముందే అరిజోనా యూనివర్శిటీ చెప్పింది. ఆ విషయాన్ని

ఐఎస్ఎస్‌లో ఒక రోజు

- ఉదయం 6-7 గంటలకి మేలుకుని 7-10 గంటల మధ్య భూసిబ్బందితో జరిగే సమావేశంలో ఆ రోజు విధులని నిర్ణయిస్తారు.
- 7.30కు ఉపాహారమయ్యాక 8.00-12.00 గంటల వరకు ప్రయోగాలు. అరగంట భోజనం తరువాత 6.00 వరకు మళ్ళీ ప్రయోగాలు. 6.00-6.30 మధ్యలో భూసిబ్బందితో సమావేశం, సమీక్ష. 6.30-7.30 మధ్యలో రాత్రి భోజనం, వార్తలు చూడటం. శుక్రవారం, శనివారం అందరూ కలిసి సినిమాలు చూస్తారు.
- సూక్ష్మ గురుత్వాకర్షణతో శారీరక సమస్యలు రాకుండా తరచూ ట్రెడ్‌మిల్ బైక్, ఇతర వ్యాయామం చేస్తారు.
- ఐఎస్ఎస్‌లో నీటి సౌలభ్యం తక్కువ కాబట్టి ప్రత్యేకమైన షాంపూ, టూత్ పేస్ట్ వాడతారు. స్నానం చేయకపోయినా పెద్ద ఇబ్బంది వుండదు. స్పాంజ్ బాత్ చేస్తారు.
- భారరాహిత్యం కారణంగా నిద్ర పోయేటప్పుడు తేలుతూ దేన్నైనా గుద్దుకునే ప్రమాదం వుంది. పక్కలకు కట్టేసుకునే నిలువుగా ఉండే స్లీపింగ్ బ్యాగ్‌లు ఉంటాయి.
- అంతరిక్షంలో నిత్యం తిరిగే పదార్థాలు స్టేషన్‌కి తగిలి ప్రమాదం కలిగించవచ్చు. అటువంటి వాటిని తొలగించడానికి రోబో ఆర్మ్ ఉంటుంది. ఒక్కోసారి వ్యోమగాములు స్పేస్ సూట్‌లు ధరించి బయటకు వచ్చి స్పేస్ వాక్ చేస్తూ రిపేర్‌లు చేస్తుంటారు.
- టాయిలెట్‌లు వాక్యూం క్లీనర్‌గా లాగా వ్యర్థాలనీ గాలినీ కమోడ్‌లోకి పీల్చేస్తాయి. వ్యర్థాలన్నీ సంచులలో నింపి అల్యూమినియం డబ్బాలలో ఉంచుతారు. అవి నిండినప్పుడు వాటిని బయటకు విడిచి పెడతారు. వాతావరణంలో పడి అవి మండిపోతాయి.
- మూత్రం మూత్రం ప్రత్యేక రీసైకిల్ యంత్రాల ద్వారా మంచి నీరు ఫిల్టర్ అవుతుంది. అదే నీటిని వ్యోమగాములు తాగునీటిగా వాడతారు.
- స్టేషన్‌లో ఫ్రిజ్‌లు ఉండవు కానీ ఆహారాన్ని వేడి చేసుకోడానికి ఓవెన్ ఉంటుంది. కెచప్‌లు, మయోనీస్ మామూలుగా వున్నా ఉప్పు, పెప్పర్ ద్రవ రూపంలో ఉంటాయి. పండ్లు, బటర్, చికెన్, బీఫ్, క్యాండీ, బిస్కెట్, కాఫీ, టీ, ఆరెంజ్ జ్యూస్ వంటివి డిస్పోజబుల్ ప్యాకెట్‌లలో వస్తాయి.
- 2010లో ఇంటర్నెట్ అందుబాటులోకి వచ్చినా చాలా తక్కువ వేగంతో ఉండేది. ఇప్పుడు నాసా సమాచార ఉపగ్రహాల ద్వారా 300 ఎమ్‌బిపిఎస్‌తో అందుబాటులో ఉంది.

నిర్ధారించడానికి స్టేషన్‌లో ప్రయోగాలు చేశారు. శూన్య వాతావరణంలో బాక్టీరియా ప్రమాదకరంగా మారుతుందని తెలిసింది. అంతే కాకుండా అలా రూపాంతరం చెందడానికి ఒక రసాయన అయాన్ తో సంబంధం ఉందని తెలిసింది. కాబట్టి ఆ అయాన్ లేకుండా చేస్తే బ్యాక్టీరియా ప్రమాదకరంగా మారదని తేలింది. ఇది భూమి మీద చాలా అవసరమైన విషయం.

క్యాన్సర్‌కి సరైన ఔషధాన్ని సరైన పద్ధతిలో సరైన ప్రదేశానికి అందించడానికి సూక్ష్మ బిందువుల అవసరం ఉంది. కానీ భూమి వాతావరణం ఇటువంటి సూక్ష్మ బిందువుల నిర్మాణానికి అడ్డంకిగా మారింది. ఇదే విషయంపై ఐఎస్ఎస్‌లో ప్రయోగాలు చేశారు. విజయం సాధించారు. ఇప్పుడు అంతరిక్ష ప్రయోగాల ఫలితాల ద్వారా భూమిపై బ్రెస్ట్ క్యాన్సర్, ప్రోస్టేట్ క్యాన్సర్ రోగులకి చికిత్స చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

కొన్ని భౌతిక శాస్త్ర ప్రయోగాలకి దీర్ఘకాలం శూన్య స్థితి, గురుత్వాకర్షణలేమి చాలా అవసరం. అటువంటి పరిస్థితులలో జీవ వ్యవస్థలు ఏ విధంగా స్పందిస్తాయి.. ఏఏ మార్పులు జరుగుతాయి.. వాటిని ఏ విధంగా అధిగమించాలి.. మొక్కలని ఇతర జంతువులని అంతరిక్షంలో అభివృద్ధి చేయవచ్చా అనే దిశలో ప్రయోగాలు జరుగుతున్నాయి. భవిష్యత్తులో మరో గ్రహంపైకి వెళ్ళడానికైనా, మన గ్రహంపైనే మెరుగ్గా వుండడానికైనా ఇటువంటి సమాచారం అవసరం కావచ్చు.

ఇవి చాలా కొన్ని ఉదాహరణలు మాత్రమే. ఇంకా ఎన్నో ఉపయుక్తమైన విషయాలు, మానవాళికి మేలు చేసే ప్రయోగాలు నిత్యం పదహారేళ్ల నుంచి ఐఎస్ఎస్‌లో జరుగుతూనే ఉన్నాయి. ఇప్పటికి దాదాపు 2000 దాకా పరిశోధనలు జరిగాయి. వాటిలో 1200కు పైగా ఫలితాలు ప్రచురణ కూడా అయ్యాయి.

ఐఎస్ఎస్ ఇంకా ఎంతకాలం

ఇంత డబ్బు, శ్రమ, కాలం ఖర్చు చేసి అంతరిక్షంలో శూన్యంలో తేలే అతి పెద్ద పరిశోధన శాల నిరంతరం ఉంటుందా అనే సందేహం కలగొచ్చు. కానీ అది ఎప్పటికి అక్కడే పనిచేస్తూ ఉండకపోవచ్చు. దాని జీవిత కాలం కొంత పరిధి వరకే ఉంటుందని అంటున్నారు. దానికి అమర్చిన పరికరాలు 2020 వరకూ పనికొచ్చే విధంగా ఉంటాయని





అని అనుకుంటున్నారు. కానీ తాజా అంచనాల ప్రకారం మరో నాలుగేళ్ళు ఐఎస్ఎస్ జీవిత కాలాన్ని పొడిగించవచ్చు అని అనుకుంటున్నారు. ఆ తరువాత పలు రకాల అంతరిక్ష 'చెత్త' లాగే ఇదీ ఆకాశంలో తిరుగుతూ ఉండొచ్చు. లేదా మన వాతావరణంలోకి ప్రవేశిస్తూ మండి బూడిదై పోవచ్చు.

ప్రాంతీయ, జాతీయ భేదాలకు అతీతంగా మానవులు సమిష్టి కృషి చేసినప్పుడు కలిగే అద్భుతాలకు నిలువెత్తు నిదర్శనం ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్. ఒక బృహత్కార్యాన్ని ఊహించడం, ప్రణాళిక రచించడం, నిర్మించడం, అమర్చడం అందులో మనుషులని నివాసం ఉండేట్టు చేయడమే కాకుండా ఏడాదికి రెండు మూడుసార్లు అంతరిక్షంలో 400 కిలో మీటర్లు ప్రయాణించి అక్కడ కొంతమందిని స్టేషన్‌లో విడిచిపెట్టి, అక్కడి వారిని తిరిగి తీసుకుని రావడం అనేది ఇప్పటికి 17 ఏళ్ళ నుండి నిరంతరాయంగా నిర్వహించడం అంటే మామూలు విషయం కాదు. భవిష్యత్తులో ఇతర గ్రహాల పరిశోధనతో బాటు, మానవుల నివాసానికి అనువైన ప్రదేశ అన్వేషణ అంతా అంతరిక్షంలోనే అనే ఆలోచనకు ఇది పునాది. ఐఎస్ఎస్ అందుకు నాంది.

కుంగ్ ఫూ నన్స్



నేపాల్‌లోని ద్రుక్ అమితాబ పర్వత బౌద్ధ మఠం వందలాది ఏళ్లుగా ఉన్న ఓ నిషేధాన్ని ఎత్తివేసింది. బౌద్ధ సన్యాసినులు కూడా యుద్ధ, ఆత్మ రక్షక విద్య అయిన కుంగ్ ఫూను అభ్యసించే అవకాశాన్నిచ్చింది. ఇదే ప్రపంచంలోని తొలి కుంగ్ ఫూ నన్స్‌ను అందించింది. సాధారణంగా మహిళల్ని వంట, తోట పనులకే పరిమితం చేసేవారు పూర్వ మఠంలో. 800 ఏళ్ల చరిత్ర ఉన్న ద్రుక్ప శాఖలో 26 ఏళ్ల క్రితం తిరుగుబాటు జరిగింది. సన్యాసినులు బౌద్ధ భిక్షువులతో సమానమేనని వారికి కుంగ్ ఫూ ఇతర విషయాల్లో అవకాశముండాలని గ్యాల్వాంగ్ ద్రుక్ప అనే భిక్షువు ప్రత్యేకంగా ద్రుక్ అమితాబ మఠాన్ని ఏర్పాటు చేశారు. ఖాట్మండూ దగ్గరలోని ఈ మఠంలో రోజువారీ పనులను మహిళలకు, పురుషులకు సమానంగా కేటాయిస్తారు. ధ్యానించడం, ప్రార్థనల బాధ్యత తీసుకోవడంతో మొదలైన మార్పు కుంగ్ ఫూ అభ్యాసన వరకు వెళ్లింది. ఆసక్తి చూపిన వారికి స్కేటింగ్, టెన్నిస్‌లోను శిక్షణ ఇస్తున్నారు.

ఉంగరంలో గుండె లయ

ప్రేమలో ఉంటే ఇరు హృదయాలు ఒకేలా స్పందిస్తాయని అంటారు. అదెంత వరకు నిజమో కానీ ప్రియతముల గుండె సవ్వడిని అనుభూతి చెందేలా ఓ ప్రత్యేకమైన ఉంగరం వచ్చేసింది. దాని పేరు హెచ్‌బీ రింగ్. ప్రేమ జంట వీటిని ధరిస్తే వేలాది మైళ్ల దూరంలో ఉన్నా కూడా ఒకరికొకరు దగ్గరగా ఉన్నట్టు అనిపిస్తుందట. టచ్ అనే వేరబుల్ టెక్ కంపెనీ రూపొందించిన ఈ ఉంగరాలు ధరించిన వారి హృదయ స్పందనల లయల్ని పంచుకుని అనుభూతి కలిగిస్తాయి. వేలి గుండా నాడీని తెలుసుకుంటాయి. స్మార్ట్‌ఫోన్ హెచ్‌బీ యాప్ ద్వారా పనిచేసే వీటిని తడితే చాలు లయ తెలుస్తుంది. ఈ చిన్ని ఉంగరంలో బ్యాటరీ, గుండ్రటి ఎల్ఈడీ అర్రే, చార్జింగ్ కనెక్టర్, మదర్‌బోర్డ్, సెన్సర్‌లు, ఫిజికల్ ఫీడ్‌బ్యాక్ మోటార్ వంటి 100 విడి భాగాలుంటాయి. బంగారంతోపాటు స్టెయిన్‌లెస్ స్టీల్ లోహాలతో ఉండే ఇవి వాటర్ ప్రూఫ్, స్క్రాచ్ ప్రూఫ్ అని కంపెనీ చెబుతోంది.

వింత లోకం

ఇళ్లను ఇసుక మింగేస్తుంది

రష్యాలోని షోయ్నా అనే గ్రామం ఆర్కిటిక్ సర్కిల్‌కు కొసన ఉంటుంది. ప్రపంచ ఉత్తర మూలన ఎడారిగా ఈ ప్రాంతానికి పేరుంది. కంటికి కనిపించనంత మేర ఇసుక కప్పుకుపోయున్న ప్రాంతంలో ఆ గ్రామస్తులు ఎలా నివసిస్తున్నారా అనే ఆశ్చర్యం కలగకమానదు. ఎందుకంటే ఇక్కడి ఇసుక తిన్నెలు వేగంగా మారిపోతుంటాయి. అందుకే ఇక్కడి రాత్రుళ్లు కిటికీలు, తలుపులు మూసివేయరు. పొద్దున లేచి చూసే సరికి ఇసుకలో ఇల్లు కూరుకు పోతుందనే భయం. శ్వేత సముద్రంలో చేపలు పట్టే జాలర్లు 1930 నాటికే ఇక్కడ నివాసాలు ఏర్పరచుకున్నారు. అక్కడ పోర్ట్ కూడా నిర్మించడంతో 1500 మంది జనాభా పెరిగింది. 70 చేపలు పట్టే బోట్లు తిరిగేవి. తర్వాత అక్కడ చేపలు లభ్యం కాకపోవడంతో ఊరు కనుమరుగవడం మొదలైంది. ఇప్పుడు కేవలం 375 మంది మాత్రమే ఉంటారు. ఇక్కడ అన్నింటికి కన్నా లాభదాయకమైన ఉద్యోగం ఏమన్నా ఉందంటే అది బుల్‌డోజర్ డ్రైవర్ పనే. ఒక్క రాత్రిలో ఇళ్లు పూర్తిగా ఇసుకలో కూరుకుపోతుంటాయి. వాటిని తోడి తీసేందుకు బుల్‌డోజర్ తప్పనిసరి. ఊరిలో ఒకే ఒక బుల్‌డోజర్ ఉంది. దానితో పదిగంటలు పనిచేస్తేగానీ ఇంటిని పూర్తిగా చూడగలం. అందుకే కొందరు ఇళ్ల పైకప్పులకు మరింత ఎత్తులో మరో మార్గాన్ని ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇల్లు పూర్తిగా ఇసుకలో కూరుకుపోతే అవి మ్యాన్‌హోల్‌లా అనిపిస్తాయి. ఈ గ్రామాన్ని మిగతా ప్రపంచంతో కలిపేవి సముద్రం, ఆకాశ మార్గమే. రోడ్డు, రైలు మార్గాలు లేవు. ఒకప్పుడు అంతో కొంతో చెట్లు, దట్టమైన గడ్డి మైదానాలు ఉండేవి. కానీ విశృంఖలంగా జరిగిన చేపల వేట, జనావాసాల అభివృద్ధి వల్ల ఎడారిలా మారిపోయిందీ ప్రాంతం.

మన లేడీ కమాండో

స్ఫూర్తి



గోవాని పోర్చుగీసుల నుంచి విముక్తికై పోరాడిన స్వాతంత్ర్య సమరయోధుడు ప్రొఫెసర్ రమాకాంత్ సినారికి ముద్దు బిడ్డ సీమారావ్. బాల్యం నుంచే భరతమాత దాస్య శృంఖలాల విముక్తికై పోరాడిన అమర వీరుల జీవిత చరిత్రలను కథలుగా వింటూ పెరిగింది. దేశభక్తిని నరనరాన జీర్ణించుకుంది. ఆనాటి నుంచే దేశానికి సేవ చేయాలనే కాంక్షను ఆమెకు వివాహమైన తర్వాత భర్త మేజర్ దీపక్‌రావు ప్రోత్సాహంతో నిజం చేసుకుంది. ఆమె 16 ఏళ్ల ప్రాయంలోనే దీపక్ రావును కలుసుకుంది. 12 ఏళ్ల ప్రాయం నుంచే మార్షల్ ఆర్ట్స్‌ని నేర్చుకున్న సీమారావ్ అభిలాషను అర్థం చేసుకున్న దీపక్ యుద్ధ సన్నాహక శిక్షణా శిబిరంలో సహ మార్గదర్శిగా సహకారం అందించాడు. మిలిటరీ శిక్షణే కాదు ఈ జంట వైద్య విద్యలో ఉత్తీర్ణులైంది. అంతేకాదు ఆ తర్వాత కూడా వారి విద్యా తృష్ణను ఆపుకోలేదు. దీపక్ ప్రతిష్ఠాత్మక సిలెట్ లా ఎన్‌ఫోర్స్‌మెంటులో సర్టిఫికేషన్ కోర్సు చేస్తే, సీమారావు క్రైసిస్ మేనేజ్‌మెంటులో ఎంబీఏని పూర్తి చేసింది. దేశ రక్షణనిచ్చే సైనికులకు శిక్షణనివ్వడమంటే మాటలు కాదు. ఆర్మీ నేవీ, బిఎస్ఎఫ్, ఎన్ఎస్‌జి దళాధిపతులను ఒప్పించి పూర్తి కాలం శిక్షకులుగా నిస్వార్థంగా భారత భద్రతా దళాలకు సేవలందిస్తోంది.

పిల్లలు వద్దనుకుని..

లక్ష్య సాధన క్రమంలో ఆమె తండ్రి చివరి చూపును చూసుకోలేకపోయింది. అంత్యక్రియలకు హాజరుకాలేదు. గర్భం దాల్చితే ఆటంకాలుంటాయని, నెలల పాటు కర్తవ్యానికి దూరంగా ఉండాల్సి వస్తుందని.. ఒక ఆడపిల్లని దత్తత తీసుకుని ప్రతి ఘడియను శిక్షణకే అంకితం చేసింది. ఆమెకు అనేకమార్లు ఎముకలు విరిగినాయి, పలుమార్లు తలకు బలమైన గాయాలయ్యాయి. ఒకసారి తలకు గాయమై జ్ఞాపకశక్తిని కోల్పోయింది. కేవలం భర్తను తప్ప ఎవరినీ గుర్తించేది కాదు. తర్వాత కోలుకుని కమాండో శిక్షణకు పునరంకితమైంది. క్లోజ్ క్వార్టర్ యుద్ధంలో సీమా చాలా ప్రతిభావంతురాలు. యుద్ధ కళలలో చాలా టెక్నిక్‌లున్నాయి. రైఫిల్స్‌తో షూట్ చేయడం, పిస్తోలుతో ప్రమాదాన్ని పసిగట్టిన వెంటనే అసంకల్పిత చర్యగా కాల్చడం, చేతులతో పోరాడటం వంటివి చాలా ఉన్నాయి. కత్తులను ఉపయోగించడం, ఇతర యుద్ధ ఆయుధాలను సరిగా ఉపయోగించడం వంటివి నేర్పుతారు. శత్రువులు, హైజాక్ చేసినపుడు ఈ యుద్ధ కళలన్నీ ఉపయోగపడతాయి. బైసన్ సిస్టం, సిక్యూబి సిస్టం కలగలిపిన సరికొత్త ప్రయోగాలతో శిక్షణలో రాటుదేలుస్తున్నారు. దేశీయ విధానంలో తుపాకులను వాడే విధానాన్ని

బ్రూస్లీ ప్రవేశపెట్టిన యుద్ధ కళ 'జీత్ కున్ దో' ప్రపంచంలో పది మంది మాత్రమే నిష్ణాతులు. వారిలో మన లేడీ బ్రూస్లీ సీమారావ్ ఒకరు. అక్కడితో ఆమె పరిచయం ఆపేస్తే చాలా తక్కువ చెప్పుకున్నట్టే. మన మిలిటరీ దళాలకు కమాండో శిక్షణనిస్తున్నారు సీమారావ్. అదీ ఉచితంగా 20 ఏళ్లుగా. ఆమె మిలిటరీ మార్షల్ ఆర్ట్స్‌లో ఏడవ డిగ్రీ బ్లాక్‌బెల్ట్ గ్రహీత. ఇదే కాదు గన్ షూటింగ్‌లో బోధకురాలు కూడా. పర్వతారోహణలోను మూడుసార్లు మెడల్స్‌ని గెలుచుకున్న ధీశాలి. మిసెస్ ఇండియా వరల్డ్ ఫైనలిస్ట్ అందుకే సీమారావ్ ఆమె పరిచయం ధైర్యంగా అనిపిస్తుంది. స్త్రీ శక్తి ఆత్మస్థైర్యంగా కనిపిస్తుంది.

వారు మరింత వృద్ధి చేశారు. యుద్ధ పోరాటాలపై వీరు ఏడు పుస్తకాలు రాశారు. అందులో మూడు పుస్తకాలు ప్రత్యేకించి భద్రతా దళాల శిక్షణకు ఉపయోగిస్తున్నారు. ఉన్నత శ్రేణి భారత దళాలన్నింటికీ అంటే ఎన్ఎస్‌జి బ్లాక్ కేట్స్, మార్కోస్, గార్డ్, పారా కమాండోస్, బిఎస్ఎఫ్ ఆర్మీ గ్రూప్స్, కమాండో విభాగానికి, జాతీయ పోలీసు అకాడెమీలో ఉన్నత శ్రేణి విభాగాలన్నింటికీ ఆమె శిక్షణనిచ్చింది.

నాలుగుసార్లు ఆర్మీ చీఫ్ పురస్కారాలనందుకుంది సీమారావ్. సమీప భవిష్యత్తులో ఇదెవరికి సాధ్యపడదు. ప్రపంచ శాంతి అవార్డు, యునైటెడ్ స్టేట్ ప్రెసిడెంట్ వలంటీర్ సర్వీసు అవార్డును కూడా అందుకుంది. 2011లో అత్యంత ప్రతిష్ఠాత్మక భారత రాష్ట్రపతి హోదా ర్యాంకు అవార్డు దీపక్‌ని ముద్దాడింది.

మహిళల కోసం ఓ యుద్ధకళ

సామాన్యులను ముఖ్యంగా మహిళలను దృష్టిలో పెట్టుకుని ఇంకా పేరు పెట్టని ఒక యుద్ధకళలో బ్లాక్ బెల్ట్ స్థాయి కోర్సును ప్రారంభించింది సీమా. మానసికంగానూ, శారీరకంగానూ ఎలాంటి అవాంతరాలనైనా ఎదుర్కొనేందుకు అవసరమైన వాటన్నింటినీ నేర్పుతారు. మొట్టమొదటి భారతదేశ మార్షల్ ఆర్ట్స్ సినిమా 'హత్యాపి'లో ఆమె కథా నాయకురాలిగా నటించి, స్వీయ నిర్మాణంలో రూపొందించింది. దీని కథంతా ఒక మహిళ పాత్ర చుట్టూ తిరుగుతుంది. ఈ చిత్రంలో మొదటి సారిగా జీత్-కునె-డో యుద్ధ కళను చూపించారు. సీమారావు ఇప్పటి వరకూ సుమారు 15 వేల మంది సైనికులకు వివిధ యుద్ధ కళల్లో శిక్షణనిచ్చారు. అసాధ్యాన్ని సుసాధ్యం చేయడమంటే ఏంటో 47 ఏళ్ల సీమారావును చూస్తే అర్థమవుతుంది.

- క.వి.చుసరా

8519834468

ఖరీదైనా నగరాల్లోనూ భద్రత కరువే

ప్రపంచంలోని అత్యధిక ధనిక దేశాల్లో దుబాయ్ ఒకటి. దుబాయ్‌లోని ఒక ఫైవ్‌స్టార్ హోటల్‌లోని మెన్స్ రూమ్‌లో తన లగేజ్‌ని భద్రపరిచి దుబాయ్ అందాలు వీక్షించేందుకు పయనమయ్యాడు డ్రూ. ఖరీదైన కార్లు, విలాసవంతమైన జీవనానికి ఆనవాలుగా నిలిచే దుబాయ్‌లో యాత్రికులకి ఎలాంటి ఇబ్బందులూ కలగవనుకున్నాడు. అయితే ఆ రోజు సాయంత్రానికి డ్రూ తను బసచేసిన హోటల్ గదికి చేరుకునేసరిగి తన బ్యాగ్ నుండి వాలెట్, ఐ ఫోన్, కెమేరా దొంగిలించబడ్డాయి. హోటల్ సిబ్బందిని ప్రశ్నించినా ఫలితం లేకపోయింది. తన కెమెరాలో సేవ్ చేసిన వందలాది ఫోటోలు మిస్సవటం తనని అధికంగా బాధించింది.

ఈజిప్ట్‌లోని బల్గేరియాకు ఓ అర్ధరాత్రి చేరుకున్న డ్రూ ఒక మంచి హోటల్‌కి తీసుకెళ్ళమని అక్కడున్న ఓ ట్యాక్సీవాలాని కోరాడు డ్రూ. ఐదు నిమిషాల తర్వాత ట్యాక్సీ మీటర్‌ని చూసి డ్రూ అవాక్కయ్యాడు. తను చేరుకోవాల్సిన హోటల్ ప్రయాణానికి రెండు వందలవుతుంది. అలాంటిది సగం దూరం కూడా ప్రయాణించకుండానే మీటర్ 4680 రూపాయల్ని చూపడంతో ఆందోళనకి గురయ్యాడు. ట్యాక్సీ ఆపి ఈ విషయాన్నే ట్యాక్సీవాలాని ప్రశ్నించగా అతను పెద్దగా అరుస్తూ అక్కడున్న కొందరు ట్యాక్సీవాలాలని పిలవడం ప్రారంభించాడు. ఇదంతా గమనించిన డ్రూకి తను ప్రమాదానికి గువనున్నాడని అనిపించడంతో అతడి చేతిలో 50 యూరోలు పెట్టి పరుగుతీశాడు. అప్పటి నుండి ట్యాక్సీ ఎక్కే ముందే ఎంతవుతుందో అడిగి మరీ ఎక్కడం ప్రారంభించాడు డ్రూ.



మనసుని ఉల్లాసపరిచే ప్రదేశాలు, సరదాగా సాగిపోయే ప్ర
విశేషాలుగా చాలా మంది భావిస్తారు. వెళ్లిన ప్రతి ప్రదేశంలో
చిన్న వయసులోనే బ్యాక్ ప్యాకర్‌గా మారి ప్రపంచయాత్ర మొద
అనుభూతులే కాదు కొన్ని చేదు అనుభవాలూ ఎదురయ్యాయి.
అనుభవాల్నీ పోగేసుకుంటూ డ్రూ తన యాత్ర కొనసాగిస్తున్నా

ప్రపంచ యాన

అమెరికాలోని ఆరిజోనా ప్రాంతానికి చెందిన గోల్డెన్‌బర్గ్(25) కాలేజీ చదువు కోసం మొట్టమొదటిసారిగా తన 16వ ఏట ప్రాగ్ చేరుకున్నాడు. అప్పటి నుండి యాత్రలంటే ముందుండేవాడు. వివిధ దేశాల్లో కొత్తవారితో ఏర్పడిన పరిచయంతో అక్కడి రుచులు, సంప్రదాయాలపై అవగాహన పెంచుకునేవాడు. తొలిసారిగా బ్యాక్‌ప్యాకర్‌గా మారి నాలుగు వారాల్లో యూరప్‌లోని 20 దేశాల్ని చుట్టొచ్చిన డ్రూకి 2012లో ప్రపంచ యాత్ర చేయాలనే ఆలోచన తట్టింది. 2013లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన డ్రూ కొరియా చేరుకుని 18 నెలలపాటు ఇంగ్లిష్ బోధించాడు. తను ప్రయాణించిన అన్ని నగరాల్లో దక్షిణ కొరియాలోని సియోల్ డ్రూని ఎంతగానో ఆకట్టుకుంది. సియోల్ ఓ అద్భుతమైన ప్రదేశం. విభిన్నమైన ఆహారం, విహారంతో పాటు విద్యుత్ కాంతుల్లో మిరిమిట్లుగొలిపే



సియోల్ నగర వీధులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థి దశలో పాఠ్యాంశాల్లో చెక్ రిపబ్లిక్‌లోని ప్రాగ్ గురించి తెలుసుకున్న డ్రూకి ప్రపంచయాత్రలో భాగంగా ప్రాగ్‌ని సమీపించే కొద్దీ ఇప్పుడా నగరం ఎలా ఉండుంటుందనే ఆత్రుత మరింత ఎక్కువైంది. ప్రాగ్‌లో మధ్యయుగం నాటి గోతిక్ చర్చ్‌లు, 13వ శతాబ్దపు చారిత్రక కట్టడాలు అతణ్ని ఆశ్చర్యపరిచాయి. చెక్ రిపబ్లిక్‌లో ప్రజల జీవన విధానం పుస్తకాల్లో తను చదువుకున్న దాని కన్నా గొప్పగా అనిపించిందతనికి. వియత్నామ్‌లో రెండు వారాలు పర్యటించిన డ్రూకి ఇతర వాహనాల కంటే బైక్‌లే అధికంగా కనిపించాయి. వియత్నాంలో తన మిత్రులతో కలిసి అక్కడి చిరు తిళ్లని రుచి చూశాడు. తక్కువ ధరతో పాటు రుచికరమైన పదార్థాలన్నీ తనకి తెగ నచ్చేశాయి. థాయ్‌ల్యాండ్ నగర రాజధాని బ్యాంకాక్‌కి సందర్శకుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. జనసాంద్రత వల్ల కాలుష్యంతో పాటు అత్యంత ఖరీదైన నగరాల్లో బ్యాంకాక్ ఒకటి కావడంతో ఖర్చు కూడా ఎక్కువే అనుకున్న డ్రూకి, బ్యాంకాక్ అంటే ప్రపంచ యాత్రికులందరూ ఎందుకు పడిచస్తారో

తెలిసొచ్చింది. విలాసవంతమై
మార్కెట్‌లు, ఆహారం, విన్యాస
అన్నీ వింతగొలిపే అనుభవాలే.
ఐదు సార్లు బ్యాంకాక్‌ని చుట్టొ

రూట్ రూట్‌కి

తైవాన్ నుండి రొమేనియా
దాదాపు 79 దేశాల్ని చేరుకుం
అనుభవాలన్నిటినీ ఎప్పటికప్పు
డ్రూ గోల్డెన్‌బర్గ్. మలేషియా న
రీఫ్ రీతిలో ఎంతో వింతగొలిపే
రాజధాని కౌలాలంపూర్‌కి చేరు
అవగతంలోకి వచ్చిందతనికి.
కౌలాలంపూర్ తనకి నిరాశే మి

అమెరికాలోని పేరొందిన
షికాగోలోని సరస్సులో పడవ
క్రీడలు తన చిన్ననాటి జ్ఞాపకా
పరుచుకున్నాడు. డ్రూ తండ్రి
కావడంతో దాదాపు 30 సార్లు
తన ప్రపంచ యాత్రలో షికా
ప్రాంతాలన్నిటినీ చుట్టబెట్టాడు
అన్నిటా వైవిధ్యాన్ని ప్రదర్శించే
ఖండంలో పేరొందిన చైనీస్,
వంటకాలన్నీ లభించడం ఇక్క
వందలాది రెస్టారెంట్లు, కేఫ్‌లు

ుయాణం, నోరూరించే రుచులు..ఇవి మాత్రమే ప్రపంచ యాత్ర
అంతా మనం ఊహించినట్టే ఉంటుందనుకుంటే పొరపాటే.
లుపెట్టి 79 పైగా దేశాలు చుట్టొచ్చిన డ్రూ గోల్డ్‌బర్గ్‌కి తియ్యని
చేరుకున్న ప్రతి దేశంలో అందమైన జ్ఞాపకాలతోపాటు వింత
ు.

ంలో పదనిసలు



జీవనమే కాదు అక్కడి బోట్
ు ఒకటేమిటి అడుగడుగునా
అంత ప్రత్యేకమైన నగరం కాబట్టే
్చాడు డ్రూ.

ో కష్టం

, జపాన్ ఇలా వివిధ ఖండాల్లోని
ూ అక్కడ ఎదురైన వింత
ు తన బ్లాగ్‌లో పొందుపరిచేవాడు
గరాన్ని బ్యాంకాక్ హనొయ్, స్లెమ్
ప్రదేశాలుగా ఊహించుకున్నాడు.
ున్నాక అసలు పరిస్థితి
నసాంద్రత గరిష్టంగా ఉండే
ల్చింది. ఎక్కడ చూసినా

నగరాల్లో షికాగో ఒకటి.
ప్రయాణాలు, అక్కడ ఆడిన
లనెన్నిటినో మదిలో పదిల
షికాగో ప్రాంతానికి చెందినవాడు
ఈ నగరాన్ని సందర్శించినా మళ్లీ
లోని మారుమూల
. సాంస్కృతిక ఆకర్షణలే కాదు
నగరం మెల్బోర్న్. ఆసియా
జపనీస్, వియత్నామీస్
ు మరో ప్రత్యేకత కావడంతో
బార్‌లు ఇక్కడ దర్శనమిస్తాయి.

గుంపులు గుంపులుగా ఉండే జనం మధ్య గాలి తీసుకోవడం కూడా కష్టమైందతనికి. ఇక భారత్‌లో రెండు నెలల యాత్రలో భాగంగా రాజస్థాన్ లోని ఉదయ్‌పూర్ నుండి జైపూర్‌కి రోడ్డు మార్గంలో అర్ధరాత్రి బస్సులో ప్రయాణం మొదలైంది. కొంతసేపటికి నిద్రలో జారుకున్న డ్రూ పెద్ద శబ్దానికి ఉలిక్కిపడి లేచాడు. అప్పటికే బస్సు పల్టీకొట్టడంతో ప్రయాణీకులు తీవ్రంగా గాయపడ్డారు. చిన్న దెబ్బలతో త్రుటిలో ప్రమాదం నుండి డ్రూ తప్పించుకున్నా అంబులెన్సు సమయానికి రాకపోవడంతో అత్యవసర వైద్యం కోసం జనం పరుగులు తీయడం, తన కళ్లముందే తోటి ప్రయాణీకులు మరణించడం అతన్ని కలచివేసింది. భారతీయ కూరల్ని రుచి చూసే క్రమంలో మరో చేదు అనుభవం ఎదురైంది.

ఆహారం కలుషితమవడంతో తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు డ్రూ. ఏడు వారాల్లో 8 కేజీల బరువు తగ్గిన డ్రూ కోలుకోడానికి పదిహేను రోజులు పట్టాయి. అందుకే వెళ్లిన ప్రతి ప్రదేశంలో ఏది పడితే అది లాగించేయకుండా జాగ్రత్త తీసుకుంటున్నాడు. భారత్‌తో జరిగిన రోడ్డు ప్రమాదం తరహాలో కాకపోయినా ఫిలిప్ఫైన్స్‌లో మరో ప్రమాదం నుండి బయటపడ్డాడు డ్రూ. ఫిలిప్ఫైన్స్‌లోని సిక్విజార్ దీవుల నుండి సెబు ప్రాంతానికి చేరుకోడానికి బోట్‌లో ఆరు గంటలు ప్రయాణించాల్సి వుంది. అయితే అలల తీవ్రత ఎక్కువవడంతో తను ప్రయాణిస్తున్న బోటు ఎగిరి పడుతుండటంతో డ్రూతో పాటు తోటి ప్రయాణీకులు భయపడిపోయారు. ఓ పక్క పెద్ద పెద్ద అలలు మరో పక్క బోటులో ఎటువంటి అత్యవసర సాధనాలూ లేకపోవడంతో జీవితంపై ఆశలు వదులుకున్నారందరూ. మూడు గంటల పాటు ప్రాణాలు గుప్పిట పెట్టుకుని ప్రయాణించిన డ్రూ చివరికి ఎలాగొలా ఒడ్డుకు చేరడంతో ఊపిరి పీల్చుకున్నాడు. ఈజిప్ట్‌లోని లండన్ వీధుల్లో విదేశీయుల్ని పరుషపు మాటలతో అవమానించే అల్లరి మూకలు, తన ట్యాక్సీ ఎక్కలేదంటూ అతిగా ప్రవర్తించిన ట్యాక్సీవాలాలూ ఎదురయ్యారు. ఆ సమయంలో స్థానికుల చొరవతో చిన్న చిన్న వివాదాల నుండి బైటపడ్డాడు డ్రూ. జార్జియాలోని ఓ రెస్టారెంట్ వద్ద ఆహారం కొనేందుకు వాలెట్ నుండి డబ్బు తీసిస్తుండగా తన చేతి నుంచి వాలెట్‌ని లాక్కుని పరుగు తీసిందో మహిళ. ఆమెని పట్టుకునే ప్రయత్నం చేయగా డ్రూని గాయపరిచి తప్పించుకుంది.

గిజా పిరమిడ్‌ల వద్ద ఒంటె స్వారీలు, టర్కీలోని కెపడోసియాలో ఎయిర్ బెలూన్‌ల విన్యాసాలే కాదు ప్రయాణాల్లో ఎదురయ్యే సమస్యలనీ ఎలా ఎదుర్కోవాలో తన 'డ్రూ బిన్కి డాట్ కామ్' బ్లాగ్ ద్వారా సూచనలందిస్తూ ప్రస్తుతం రియో ఒలింపిక్స్ దిశగా తన ప్రపంచ యాత్రని కొనసాగిస్తున్నాడు.

-అద్దేపల్లి శర్వాణి

చిన్నతనంలోకి..

వింత గొలిపే ఆ అద్భుతాలిన్నిటినీ చూసేందుకు ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ నగరానికి రెక్కలు కట్టుకుని వాలిపోయాడు. కొన్ని దేశాల్లో అర్ధరాత్రి వరకు దుకాణాలు తెరిచుంచడం ప్రత్యేకంగా అనిపిస్తే తైవాన్‌లోని ఎన్నో. ప్రాంతాల్లో మార్కెట్లన్నీ రాత్రి నుండే ప్రారంభమవుతాయి. మరుసటి రోజు ఉదయం వరకు నిర్వహించే ఈ నైట్ మార్కెట్‌లన్నీ పర్యాటకుల కోసమే ప్రత్యేకంగా ఏర్పాటు చేసినవి. పేస్ట్రీ, నూడిల్స్, హాట్ పాట్, డంప్లింగ్స్ ఇలా తైవాన్‌లో లభించే ప్రత్యేక రుచులన్నీ డ్రూకి ఎంతగానో నచ్చేశాయి.

శ్రమ జీవితం

కొడవలి - గొడ్డలి -
గునపం - పార
కత్తి- సుత్తి-
రంపం- గంప
అలుపు సొలుపు లేని
కష్టం నీదిరన్నా !
నడువు జాగరత, నీ
నడుం జాగరతా!!

పెన్ను, ఫ్యాను,
ఫైలు, టేబుల్
ట్యూబు, బల్బు,
కంప్యూటర్, కరెంటు
రాతల కూలోడో నీ
మనసు కాదు
రాయి..
రాతిరైన కూడా నీకు
లేనే లేదు హాయి.....
రిక్షా, సైకిలు,
మోటరు, కారు
బస్సు, రైలు, సినిమా
రీలు
శ్రమజీవంతోనే
నడుస్తున్నాయంతా
శ్రమతోనే భూగోళం
తిరుగుతోంది
ఇంకా....

శ్రమయే గమ్యం
శ్రమయే నిత్యం
శ్రమయే సత్యం
శ్రమయే రమ్యం
శ్రమలోనే ఉంది
జీవన సదృశ్యం
శ్రమయే లేకున్నా ఈ
జగతి మొత్తం
శూన్యం !!???

- పద్మా సతీష్
8519834468



కందిలి



సంధ్య కుంగేవేళ
పశువులు ఇంటికేగే వేళ
చీకటి పడీ పడకముందే
అందించే
వెలుతురు కందిలి దే
గ్యాస్ నూనె ఇంధనం
అగ్గిపుల్ల ఆయువు
వలయాకారపు చక్రంలో
గ్లాస్‌తో వాయు కట్టడి
వెలుతురు హెచ్చు
తగ్గులు

బత్తి చక్రం తిప్పడంతో
చదివేది రాసేది
పశువులకు మేతేసేది
వంట చేసేది
భోం చేసేది కందిలి
పుణ్యమే
పడుకునేది బత్తి బాగా
తగ్గించి
సంధ్య ఉదయించగానే
కందిలి ఆర్పి
మసి బారిన గ్లాస్ తుడిచి
కొక్కేనికి వేలాడతీత
నాటి రాత్రి జీవనానికి
దిక్సూచి

- గిరిప్రసాద్ చెలమల్లు
9493388201

ఆహ్వానం

మీ కవితలు పంపాల్సిన చిరునామా:
స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4, ఆకుల
వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ.-520002.
మెయిల్ అడ్రస్
:snehaweekly.praja@gmail.com



ఆయుష్షు పెంచే ఆట స్థలాలు

అక్కడి పార్కుల్లో కేరింతలు కొట్టేది చిన్నారులు కాదు తాతయ్యలు, అమ్మమ్మలు. కేరింతలకు తోడు సంతోషాల పలకరింపులు.. ఆప్యాయతల హరివిల్లులు ఉయ్యాలలూగుతుంటాయి. ఎక్కడ చూసినా ఆటల్లో మునిగిపోయిన వృద్ధులే కనిపిస్తారు. ఇవి కేవలం వృద్ధుల కోసం ఏర్పాటు చేసిన ఆట స్థలాలు.

మనోస్థైర్యాన్ని కోల్పోయిన ఎందరో వృద్ధులను మమేకం చేసే ప్రదేశాలుగా ఇవి ఉపయోగపడుతున్నాయి. ఇటీవల స్పెయిన్‌లోని బార్సిలోనాలో వృద్ధుల కోసం 300కు పైగా ప్రత్యేక ఆట స్థలాలను ఏర్పాటు చేశారు. వాళ్లలో ఒంటరితనాన్ని తరిమేసే వేదికగా మారాయా పార్కులు. వ్యాయామం చేయడం ద్వారా కేవలం శారీరక బలం చేకూరుతుంది. కానీ అదే ఉత్సాహంతో చేస్తే... మానసిక ఉల్లాసమూ తోడవుతుంది.

ఈ ప్లే గ్రౌండ్స్‌లో ఏ ఒక్కరూ విశ్రాంతిని కోరుకోరు. మనసునూ, శరీరాన్నీ ఉరకలెత్తించే అనేక వ్యాయామ పరికరాలు ఇక్కడున్నాయి. మోటారు సైకిళ్లు, అలసట పెంచే గుర్రపు స్వారీలూ, దీర్ఘ వృత్తాకార చెక్క ఉయ్యాలలూ తాత, బామ్మల కోసం వేచి చూస్తాయి. వీళ్ల నడక సామర్థ్యాన్ని పెంచేందుకు అనువైన మెట్ల మార్గాలు, ఆహ్లాదకరంగా ఉండే తోరణాలు ఇక్కడ ఉన్నాయి. అలసిన సమయంలో నీడలో కూర్చుని ఆడుకోవడానికి వీలుగా అనేక ఇండోర్ గేమ్స్ కూడా ఏర్పాటు చేశారు. ఆడుకునే అరవయ్యేళ్ల పసిహృదయాల మధ్య స్నేహం, వాళ్లలో మానసిక ఉల్లాసాన్ని కలిగించి ఆయుష్షు పెంచుతుందట. వాళ్లంతా ప్రతి రోజూ ఈ పార్కుల్లో సమావేశమై కష్ట సుఖాల కబుర్లతో సమయాన్ని వృథా చేయరు. ఆటల్లో మెళకువలను అలవరుచుకుంటారు. ఒంటరితనంతో పోరాడే ఎందరో వృద్ధుల జీవితాలకు ఆనందాల వెలుగులు చూపించే మార్గమిదే.

రెండు దశాబ్దాల క్రితమే అనేక వ్యాయామ పార్కులూ, ప్రత్యేకంగా ఆట స్థలాలు కొన్ని దేశాల్లో నిర్మించారు. ఇవి కేవలం యుక్త వయస్కులకూ, చిన్న పిల్లలకూ మాత్రమే ఉండేవి. వృద్ధుల కోసం ప్రత్యేకంగా ఇంగ్లాండ్, జపాన్, ఫిన్లాండ్, జర్మనీ, కెనడా, స్పెయిన్ వంటి దేశాలు ముందుగా ప్రారంభించాయి. కానీ అత్యధికంగా ఇప్పుడు బార్సిలోనాలో 300కు పైగా ప్లే గ్రౌండ్స్ అనేక హంగులతోనూ ఆట వస్తువులతోనూ నిర్మించడం ప్రత్యేకం.

పరిశోధించి మరీ..

ఆసియా, యూరప్‌లో అన్ని వయస్సుల వారికీ ఆట స్థలాలు ఉండేవి. ఇక్కడ కేవలం చిన్నపిల్లల కోసం మాత్రమే తాతయ్య, బామ్మలు ఆటస్థలాలకు వచ్చేవారు. ప్రతి రోజూ వాళ్లు కూడా ఆటల్లో మునిగిపోయేవారు. క్రమంగా వారి భౌతిక, మానసిక స్థితిలో మెరుగుదల మొదలయింది. ఆ ఆటస్థలాలే వృద్ధులకు ఒక వరంగా మారాయి. క్రమంగా వ్యాధినిరోధక శక్తి పెరగడం, ఎముకలు గట్టిపడటం వాళ్లలో గమనించారు. తర్వాత ఫిన్లాండ్ యూనివర్శిటీకి చెందిన పరిశోధకులు 65 నుంచి 81 మధ్య వయస్సు గల వృద్ధులపై ఒక సర్వే చేపట్టారు. వాళ్లను ఒక మూడు నెలల పాటు ప్లే గ్రౌండ్సులో గడపమని సూచించారు. ప్రతి రోజూ 90 నిమిషాల పాటు వాళ్లు అనేక ఆటలతో ఆనందంగా గడిపారు. మూడు నెలల తర్వాత ఆ వృద్ధుల నడకలో వేగం, మనోధైర్యం, ఎముకలలో బలం స్పష్టంగా కనిపించాయి. అప్పటి నుంచీ వృద్ధుల కోసం ఆటస్థలాలను విస్తృతంగా ఏర్పాటు చేశారు.

జర్మనీ కూడా వీటి ఏర్పాటులో ముందంజలో ఉంది. ఇక్కడ 180 మంది వృద్ధులపై చేసిన సర్వేలో సగానికి సగం మంది వాళ్ల వయస్సు గల వారితోనే ఆడుకోవడానికీ, ఎక్కువ సమయం గడపడానికీ, ఇష్టపడుతున్నట్లుగా తేలింది. వాళ్ల కోసం ప్రత్యేకమైన ప్రదేశాన్ని కోరుకున్నట్లుగా స్పష్టమైంది. అందువల్ల జర్మనీలో వీటిని అభివృద్ధి చేయడం ప్రారంభించారు. వివిధ దేశాల్లో వీటి సౌకర్యాలు విభిన్నంగా ఉంటాయి. ఏదేమైనా వృద్ధుల ఆయుష్షును పెంచడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తున్నాయి.

కభూమ్ అనే స్వచ్ఛంద సంస్థ అమెరికా మొత్తం మీద 53 ఆట స్థలాలను నిర్మించి లక్షా 35 వేల 400 మంది పిల్లలకూ, 60 వేల 500 మంది వృద్ధులకు ఈ సంస్థ సేవలందిస్తోంది. ఈ సంస్థను సారా పినస్కీ అనే వ్యక్తి నడుపుతున్నాడు. ఆటలు ఏ వయస్సువారికైనా మనసుకు ప్రశాంతతనిస్తాయి. భౌతిక , మానసిక ఎదుగుదలకూ ఇవి సహకరిస్తాయి. ముఖ్యంగా పోటీతత్వం పెరుగుతుంది. ముసలితనంలోనూ ఎదగాలనే కోరిక. అందుకే ఆటలను ఎంచుకున్నానని పార్కులను ఏర్పాటు చేశాడట.

- మంగ.కె





దులారీ

తెలుగు సేత : **జగద్ధాత్రి**

8712293994



ఈ కథ 'అంగారే' అనే కథా సంకలనంలోనిది. ఇందులో ఎనిమిది కథలు ఒక నాటకం ఉన్నాయి. అరసం వ్యవస్థాపకులు డాక్టర్ రషీద్ జహాన్, ఆమె భర్త డాక్టర్ సయ్యద్ జహీర్ కలిసి తీసుకొచ్చిన మొట్టమొదటి ఉర్దూ కథా సంకలనమిది. ఈ పుస్తకాన్ని మతాచారాలకు వ్యతిరేకంగా ఉన్నదని అప్పట్లో నిషేధించారు. రషీద్ జహాన్ పేరు ముందు 'అంగారేవాలీ' అని ఆమె ధైర్యానికి గుర్తుగా వ్యవహరించేవారు. అభ్యుదయ రచయితల సంఘం సంస్థాపక సభ్యురాలు ఈమె. ఇటీవల ఈ కథలను అమెరికాలో ఒక ప్రొఫెసర్ స్నేహాల్ సింఘ్వీ ఆంగ్లీకరించారు.

చిన్నప్పటి నుండి అదే ఇంట్లోనే ఉండి పెరిగినా.. ఆ బానిస అమ్మాయి పదహారు పదిహేడేళ్లప్పుడు ఇంట్లోంచి పారిపోయింది. ఆమె తల్లిదండ్రుల గూర్చి ఏ వివరాలు తెలీవు. ఆమె లోకమంతా ఆ ఇల్లు, అందులోని మనుషులే. షేక్ నాజీమ్ అలీ సాహిబ్ బాగా డబ్బున్నవాడు, సంతానానికి కూడా ఏమీ లోటు లేదు. కూతుళ్ళు, కొడుకులు ఉన్నారు. ఆ ఇంటి యజమానురాలు కూడా బాగానే ఉంది. ఆడవాళ్ళ జనానా నుండి ఇంటి వ్యవహారాలన్నీ ఆమె నడిపేది. దులారీ ముందుగా ఆమెకు పని మనిషి. ఇంట్లో పని చేయడానికి ఇంకా మిగిలిన వంటవాళ్లు, పనివాళ్ళు వస్తూ ఉండేవారు. కానీ ఒక నెల, రెండు నెలల్లోనో, ఒక ఏడాది రెండేళ్లలోనో, ఏదో ఒక బాధ కలిగించే విషయం జరిగి పని వదిలేసి వెళ్లిపోయేవారు. కానీ దులారీకి మాత్రం ఆ ఇల్లు తప్ప మరో నెలవు ఎక్కడా లేదు. ఆ కుటుంబం వారు ఆమె పట్ల దయగానే ఉండేవారు. భోజనం, బట్టలు గురించి దులారికి ఏమీ ఫిర్యాదు లేదు. మిగిలిన పనివాళ్ళతో పోల్చుకుంటే ఆమెకు తన స్థితి మెరుగుగనే అనిపించేది. కానీ ఏ వంట మనిషితో నైనా తగాదా పడినప్పుడు "కనీసం నేను నీలా బానిసని కానులే" అనే మాట వినాల్సి వచ్చేది. దానికి దులారీ వద్ద సమాధానం ఏమీ లేదు.

◆◆◆

ఈ లోకంలో ఎవరూ పట్టించుకోకుండానే ఆమె చిన్నతనం గడిచిపోయింది. ఆ ఇంట్లో కోడళ్ళ కంటే, అంతే కాదు మిగిలిన పని వాళ్ళ కంటే కూడా ఆమె స్థితి తక్కువైనది. పుట్టుకే బానిసగా పుట్టింది. తన తక్కువ స్థితికి దులారి ఎప్పుడు బాధ పడలేదు. కానీ బాల్యం వీడి కౌమార దశకి వచ్చేటప్పటికి తాను ఎదుర్కోవాల్సిన బాధలు ఒక్కోసారి చేదుగా ఉండేవి. దానితో ఆమె బాగా కుంగిపోయేది. ఇది ఒక మానసిక స్థితి. దీనికి కారణం ఊహించలేదు. వైద్యం ఆమె వద్ద లేదు. ఆ ఇంట్లో చిన్న అమ్మాయిగారు హసీనా బేగమ్, దులారి చిన్నప్పటి నుండి చాలా స్నేహితులు. చిన్నప్పుడు ఇద్దరు కలిసి ఆడుకునేవారు. సమయం గడిచేకొద్దీ ఇద్దరి మధ్యా దూరం పెరుగుతూ వచ్చింది. గొప్పింట్లో పుట్టడం వల్ల హసీనా చదువుకుంటూ, రాసుకుంటూ, కుట్లు నేర్చుకుంటూ, ఇంటిని చక్కదిద్దటం నేర్చుకుంటూ గడిపేది. దులారీ గదులన్నీ దులపడం, గిన్నెలు తోమడం, నీళ్ళు తేవడం చేసేది. దులారీ చాలా అందగత్తె. కళగల ముఖం, పొడువైన కాళ్లు, చేతులతో నిండుగా ఉండేది. కానీ సాధారణంగా ఆమె బట్టలు మురికిగా చినిగి పోయి ఉండేవి. ఆమె వొంటి



నుండి ఒక విధమైన దుర్గంధం వస్తూ ఉండేది. పండుగలప్పుడు మాత్రం దాచుకున్న బట్టలు వేసుకుని ముస్తాబు కూడా చేసుకునేది. ఇంటి యజమానురాలితో గానీ ఆమె కూతుళ్లతో గానీ బయటికి వెళ్లాల్సి వచ్చినప్పుడు శుభ్రమైన బట్టలు వేసుకునేది.

♦♦♦

ఆ ఇంట్లో ఒకానొక పెళ్లి ముందరి సాయంత్రం. ఆ రోజు దులారి బొమ్మలా తయారయింది. ఆడవాళ్లుండే జనానాలో టపాకాయలు కాల్చారు. కుటుంబమంతా పనివాళ్ళతో సహా ఆ వేడుకని చూస్తున్నారు. పిల్లలు ఆనందంతో కేరింతలు కొట్టారు. ఆ ఇంటి చిన్న అబ్బాయి గారు కాజిం కూడా ఉన్నాడు వారిలో. తనకు ఇరవై, ఇరవై ఒకటో ఉంటుంది వయసు. కాలేజ్ చదువు దాదాపు పూర్తైనట్టే. అతని తల్లికి అతనంటే చాలా ప్రేమ. కానీ తను మాత్రం తన వాళ్లందరి పట్లా చిరాకుగా ఉండేవాడు. వీళ్ళంతా మూర్ఖులని, సంకుచిత మనస్కులని అతని భావన. సెలవులకి ఎప్పుడు ఇంటికి వచ్చినా అతని సమయమంతా తనలో తాను ఇంట్లో వాళ్లందరినీ విమర్శిస్తూ గడిపేసేవాడు. తనకు సంప్రదాయాలు అంటే నచ్చేవి కాదు, అయినా మొహం కోపంగా పెట్టుకుని భరించేవాడు. అంతకన్నా ఏమీ చేయలేకపోయేవాడు. కాజింకి దాహం వేసింది.

తల్లి భుజం మీద తలపెట్టి అడిగాడు “అమ్మీ జాన్ దాహంగా ఉంది”. తల్లి ప్రేమగా వెంటనే జవాబిచ్చింది.. “బాబు, ఏదైనా షర్బత్ తాగు. ఉండు నీ కోసం ఏవైనా చేయిస్తాను ఇప్పుడే” అని దులారీని పిలిచి షర్బత్ చేయమని చెప్పింది.

కాజిం అన్నాడు.. “లేదులే అమ్మీ జాన్, తనని ఆ టపాకాయలు చూడనీ, నేనే లోపలికి వెళ్ళి మంచినీళ్ళు తాగి వస్తాను.” అని.

అప్పటికే దులారి యజమానురాలి మాట అనుసరించి లోపలికి వెళ్లింది. ఆమె వెంటే పరిగెట్టుకుంటూ కాజిం వెళ్లాడు. చీకటిగా ఉన్న బీరువాలో షర్బత్ సీసా కోసం వెదుకుతోంది దులారి. కాజిం ఆమె వద్దకు వెళ్ళి నిలుచున్నాడు.

దులారీ తిరిగి చూసి అడిగింది “ఎలాంటి షర్బత్ కలపమంటారు మీకు” అని. ఆమె ప్రశ్నకు సమాధానం రాలేదు. కాజిం దులారీని తదేకంగా చూశాడు. దులారీకి వొళ్ళంతా వణికింది. కళ్ళు నీటితో నిండాయి. సీసా తీసుకుని తలుపు వైపు కదిలింది. కాజిం అడుగు ముందుకు వేసి ఆమె చేతిలో సీసాను తీసి పక్కన పెట్టేసి ఆమెను కౌగిలించుకున్నాడు. ఆ పిల్ల కళ్ళు మూసుకుని తన దేహాన్ని, మనసునీ అతని కామానికి ఆహుతి ఇచ్చింది.

ఇద్దరు మనుషులు రెండు లోకాలుగా, రెండు వేరు వేరు జీవితాలుగా బతికినవారు ఇప్పుడు వాంఛ మత్తులో మునిగిపోయారు. వాస్తవం, దురదృష్టం ఏంటంటే వారిద్దరు చీకటి శక్తుల సముద్రంలో కొట్టుకెళ్లిపోయే శిథిలాల లాగా ఉన్నారు.

♦♦♦

ఒక ఏడాది గడిచింది. కాజింకి పెళ్లి నిశ్చయం చేయబడింది. పెళ్లి రోజు కూడా వచ్చింది. మరో నాలుగైదు రోజుల్లో ఇంటి కోడలు వస్తుంది ఇంటికి. అతిథులతో ఇల్లు కిక్కిరిసిపోయింది. అంతా పండుగ వాతావరణం. సర్కస్ ఫీట్లు లాగా ఎడతెగని పనులు. ఒక రోజు రాత్రి వేళ దులారీ మాయమైపోయింది. వెదుకులాట కొనసాగింది. పోలీసులను పిలిచారు. కానీ ఎవ్వరూ ఆమెను కనుక్కోలేక పోయారు. ఒక పనివాడిని దులారీ పారిపోవడానికి సహాయం చేశాడని, ఎక్కడో దాచాడని అనుమానించారు. ఆ పనివాడిని పనిలోంచి తీసేశారు. అతని దగ్గర దాక్కున్న దులారీ దొరికింది. కానీ ఇంటికి తిరిగి రావడానికి ససేమిరా ఒప్పుకోలేదు.



♦♦♦

మరో మూడు నాలుగు నెలల తర్వాత.. షేక్ నాజీమ్ ఆలీ పాత పని వాడొకడు ఆమె ను టౌన్‌లో వేశ్యలుండే చోట చూశాడు. ఆ ముసలివానికి దులారీ చిన్నప్పటి నుండీ తెలుసు. ఆమె దగ్గరకు వెళ్ళి శతవిధాలా ఆమెను ఇంటికి తిరిగి రమ్మని ఒప్పించడానికి ప్రయత్నించగా ఆమె చివరికి ఒప్పుకుంది. ఆ ముసలివాడు ఆ అమ్మాయిని తిరిగి తీసుకెళ్తున్నందుకు ఏదో బహుమానాన్ని.. అలాగే ఈ పిల్ల ఇంకా దురదృష్టాల పాలబడకుండా ఉంటే బాగుండును అని ఆశించాడు. దులారీ తిరిగి రావడం మొత్తం ఇంట్లో చాలా సంచలనం కలిగించింది. తల వంచుకుని, వేలి నుంచి తల దాకా తెల్లటి బట్ట చుట్టుకుని లోపలికి వెళ్తోన్న దులారీలో ఏదో బాధ కనబడింది. కప్పుతో ఉన్న ఇంటి పెరట్లోకి వెళ్ళి కింద కూర్చుంది. ముందు ఆడ పనివాళ్ళు ఆమె దగ్గరికి వచ్చారు. దూరం నుంచే ఆమెను చూసి ‘ఛొఛొఛో’ అని జాలిగా శబ్దాలు చేసి వెళ్ళిపోయారు. సరిగ్గా అప్పుడే నాజిమ్ ఆలీ సాహెబ్ జనానాలోకి ప్రవేశించాడు. దులారీ తిరిగి వచ్చిందని వినగానే ఆమె కూర్చున్న దగ్గరికి వెళ్ళాడు. ఆయన ఎప్పుడూ ఏదో వ్యాపార వ్యవహారాలతో సతమతమౌతూ ఉంటాడు. ఇంటిలోని విషయాలను గురించి అంతగా పట్టించుకోడు. ఈ చిన్ని సమస్యలకి అతని వద్ద సమయమెక్కడిదీ! దూరం నుండే దులారీని కేకేసి “ఏయ్ వెర్రిదానా, మరెప్పుడూ ఇలాంటి వెధవ పని చేయకు” అంటూనే అతని పని మీద తాను వెళ్ళిపోయాడు.

అతను వెళ్లాక ఆ ఇంటి చిన్నమ్మాయిగారు నెమ్మదిగా వచ్చి దులారీ దగ్గరికి వెళ్లింది. కానీ మరీ దగ్గరికి పోకుండా ఆగింది. ఎవరూ లేరు ఆ సమయంలో అక్కడ. తాను దులారీ ఒకప్పుడు కలిసి ఆడుకున్నారు. దులారీ ఇంట్లోంచి పారిపోవడం హసీనాను బాగా కదిలించింది. మంచి మనసున్న, నిర్మలమైన హసీనా బేగమ్‌కి జాలి వేసింది ఈ అనాథని చూసి. కానీ చిన్నప్పటి

నుండి కాలు బయట పెట్టకుండా ఈ ఇంట్లోనే పెరిగిన పిల్ల ఇలా ఎందుకు చేసిందో మాత్రం ఆమెకు అర్థం కాలేదు. అందుకు ఫలితమేమైంది.. దేహాన్ని అమ్ముకోవడం, దు:ఖం, ఈ వేధింపులు. తలవంచుకుని కూర్చుని ఉంది దులారీ. ఆమె మాన మర్యాదలు మంటగలిసినా పెద్దింటి పిల్లకు మళ్లె బాధ పడక్కర్లేదట... బానిస పిల్లే కనుక. ఎవరో ఒక పని వాడికిచ్చి కట్టబెట్టేస్తారు. ఆపైన అంతా అదే సర్దుకుంటుందట.

♦♦♦

నెమ్మదిగా మృదువుగా హసీనా బేగమ్ అడిగింది "దులారీ! , ఏమిటి నువ్వు చేసిన పని?" అని. తలెత్తి చూసింది దులారీ. నీళ్ళు నిండిన కళ్లతో తన చిననాటి నెచ్చెలి వైపు ఒకసారి చూసి మళ్ళీ తల దించేసుకుంది. హసీనా బేగమ్ వెళ్దామనుకున్నంతలో ఇంటి యజమానురాలు వచ్చింది అక్కడికి. ఆమె ముఖంలో విజయోత్సాహమైన నవ్వు మెరుస్తోంది. తిన్నగా వెళ్లి దులారీ ఎదురుగా నిలబడింది. దులారీ అలాగే మౌనంగా ఎలా కూర్చుని ఉందో అలాగే ఉండిపోయింది. కదలలేదు. యజమానురాలు తిట్టడం ఆరంభించింది. "సిగ్గులేనిదానా! తిరిగొచ్చావేం. మళ్ళీ ఎక్కడి నుండి పోయావో అక్కడికే అవునా? నీకు నువ్వే మాన మర్యాదలు పోగొట్టుకున్నావు, చూడు లోకమంతా నిన్ను శపిస్తుంది! ఇదే నీ పాపానికి తగిన శాస్తి..."

ఎన్ని తిట్టినా యజమానురాలికి మాత్రం దులారీ తిరిగి వచ్చేయడం ఆనందంగానే ఉంది. తాను ఇంట్లోంచి వెళ్లిపోయిన దగ్గర్నుంచీ ఇంట్లో ఏ పనీ సరిగ్గా అవడం లేదు.

యజమానురాలు దులారీని పెద్దగా తిట్టడం ఇంటందరూ వచ్చి చూశారు. ఒక అపవిత్రమైన, చెడిపోయిన దానిగా చీవాట్లు తింటుంటే అందరూ తమ గతి మెరుగుగానే ఉన్నందన్నట్టు సంతోషించారు కూడా. శవంలోకి తన పదునైన ముక్కును దింపే అమానుష డేగకి ఈ బాధ ఎలా అర్థం అవుతుంది?

హఠాత్తుగా, కాజిం పక్కనే ఉన్న గదిలో నుండి బయటికి వచ్చాడు తన అందమైన భార్యతో కలిసి. దులారీ వైపు కనీసం చూడను కూడా లేదు అతను. అతని ముఖం కోపంతో జేవురించి ఉంది. తల్లితో తీవ్రంగా అన్నాడు "అమ్మా నీకు దణ్ణం పెడతా. ఆ పిచ్చి పిల్లని వదిలేయ్. తాను అనుభవించింది చాలు. నీకర్థం అవుతోందా ఆ అమ్మాయిని నువ్వేమి చేస్తున్నావో ?"

దులారీ అతని కంఠం వినడానికి ఒళ్ళంతా కూడదీసుకోలేకపోయింది. కాజిం, తను గడిపిన ఒంటరి రాత్రులలో తన చెవులు విన్న తియ్యని ప్రేమ పలుకులు యింకా స్పష్టంగా గుర్తున్నాయామెకి. కాజిం పెళ్లి ఆమె హృదయాన్ని కత్తిలా కోసింది. ఆ దుర్మార్గం, హృదయం లేనితనం ఏమేమి చేసిందో ఆమెని. పైగా ఇప్పుడితని మాటలు ఈ విధంగా! గుండె కోస్తున్న బాధ దులారీని ఆ క్షణంలో స్త్రీ ఆగ్రహంగా మార్చింది. లేచి చుట్టూ మూగి చూస్తున్న వారందరి వైపు కన్నెర్రజేసింది. ఒక్కొక్కరూ మెల్లగా జారుకున్నారు. ఇక ఇదే ఒక దెబ్బతిన్న ఒంటరి పక్షి చేసిన చివరి ప్రయత్నం. అదే రోజు రాత్రి ఆమె మళ్ళీ మాయమయ్యింది.

✦

ఇన్‌స్టా తెలుగమ్మాయి

సోషల్ మీడియా ఫొటో షేరింగ్‌లో ఎప్పుడూ ముందుండేది ఇన్స్టాగ్రాం అని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. దానికి అంత పేరు రావటానికి కారణమైన వారిలో మన తెలుగమ్మాయి కూడా ఒకరున్నారు. ఇన్స్టాగ్రాం ఎడ్వర్టైజింగ్ టీమ్‌ని ప్రారంభించినవారిలో మన తెలుగమ్మాయి సమీరా ఇనపకుటికది కీలక పాత్ర కూడానూ!

సమీరా గతంలో ఫేస్‌బుక్ సంస్థలో డేటా సైంటిస్ట్‌గా పనిచేసింది. కొన్నాళ్ళకు ఇన్స్టాగ్రాం ప్రచారం కోసం ఏర్పాటు చేసిన బృందంలో ఎంపికైంది. ఇన్స్టాగ్రాం ఆదాయానికి సంబంధించిన ప్రతి చర్యకి తనే బాధ్యురాలిగా వ్యవహరించేది. అలా అతికొద్ది కాలంలోనే ఇన్స్టాగ్రాం ఫేస్‌బుక్ ఆదాయాన్ని అధిగమించేసింది. అందుకు ప్రధాన కారణం సమీరా కృషి అని చెప్పవచ్చు. అలా ప్రపంచవ్యాప్తంగా ప్రధానమైన సాంకేతిక రంగంలో ముందుకు దూసుకుపోతున్న మహిళల్లో సమీరా కూడా ఒకరుగా నిలిచారు. సమీరా బిర్లా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (బిట్స్), పిలానీలో గ్రాడ్యుయేషన్ పూర్తిచేసింది. స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసినవారిలో ఏకైక భారతీయ మహిళ సమీరానే. స్టాన్‌ఫోర్డ్‌లో చదివే సమయంలో 'బిజినెస్ అసోసియేషన్ ఆఫ్ స్టాన్‌ఫోర్డ్ ఆంట్రప్రెనూర్ స్టూడెంట్స్' (బేసెస్)లో వైస్ ప్రెసిడెంట్‌గా ఆమె సేవలందించింది. ఆ సమయంలో సిలికాన్ వ్యాలీలో వ్యాపారవేత్తలు ఎవరైనా పెట్టుబడి పెట్టాలనుకునే వారి దగ్గర నుండి చందాలు తీసుకుని కొత్తగా ఏర్పాటయిన స్టార్టప్ కంపెనీల ఎదుగుదలకు ఆ పెట్టుబడులు ఉపయోగించటానికి సమీరా చాలా కృషి చేసింది. కెరీర్ ప్రారంభంలో క్వేరా, నెట్‌ఫ్లిక్స్ కంపెనీల కొత్త ప్రాజెక్టులు, వ్యాపారాభివృద్ధికి, మొబైల్ యాప్స్ డిజైనింగ్, ఆన్‌లైన్‌కి సంబంధించిన ప్రోగ్రామ్స్ చేస్తూ ఉండేది. అలా 'ది ఇండస్ ఆంట్రప్రెనూర్స్ (టిఐఈ50)' అనే స్టార్టప్ కంపెనీ స్థాపించినవారిలో కీలకమైన పాత్ర పోషించింది. ఆ తరువాత ఎఫిషియంట్ ఫ్రాంటియర్స్ అనే కంపెనీలో బిజినెస్ ఎనలిస్ట్‌గా పనిచేసింది. ఇప్పుడు డేటా సైన్స్ అనేది చాలా ప్రధానమైన విభాగం. ఇంజినీరింగ్, మ్యాథ్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బిజినెస్ స్ట్రాటజీ వీటన్నిటిని కలిపితేనే డేటా సైన్స్. 2005లో 'ఇంట్ యాప్' అనే చిన్న సంస్థలో ప్రారంభమైన ఆమె కెరీర్ ఇప్పుడు "ఇన్స్టాగ్రాం" వరకు ఎదిగేలా చేసిందంటే ఆమె కష్టం, పట్టుదల ఏ స్థాయిలో ఉంటుందో గ్రహించవచ్చు. భారతీయ విద్యార్థులు పరుగెడుతున్న టెక్నాలజీని అందుకోవాలని, చిన్న చిన్న ఉద్యోగాలతో సంతృప్తి పడకూడదని అభిప్రాయపడుతున్నారు సమీరా. మహిళలు కేవలం వంట గదికే పరిమితం కాకూడదని, వారు తమ జీవితాశయాలు నెరవేర్చుకునే ప్రయత్నాలు చేయాలని, అలాంటప్పుడే ఎన్నో విజయాలు సాధించవచ్చని సమీరా అంటోంది. ఏదేమైనా ఆమె విజయ ఛేదనకు తాను ఎదుర్కొన్న సవాళ్లు ఎంతగానో ఉపయోగపడ్డాయనే చెప్పాలి.

- పెండెం సురేంద్ర

తెలుసా



♦ అసలీ పుస్తకం తేవాలనే ఆలోచన ఎలా వచ్చిందంటే.. 1951లో ఐర్లాండ్‌లోని కౌంటీ వెక్స్‌ఫోర్డ్‌లో ఓ షూటింగ్ పార్టీని గిన్నిస్ బ్రూవరీ ఎండీ హ్యూగ్ బీవర్ ఏర్పాటు చేశాడు. అందులో ఓ పక్షి గురి తప్పడంతో బీవర్‌కు అతిథులకు మధ్య ఏది వేగవంతమైన పక్షినే చర్చ నడిచింది. అలాంటి రికార్డుల గురించి తెలిపే ఏ పుస్తకం అప్పట్లో అందుబాటులో లేదు.

♦ గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ తొలి సంచిక 1955 ఆగస్ట్ 27న ప్రచురించారు. ఆరు శతాబ్దాలైన తర్వాత కూడా రికార్డుల నమోదు విషయంలో దీని రికార్డుకు ఎదురులేదు.

♦ ఓ జిమ్‌ను రెండు గదులుగా మార్చి గిన్నిస్ సూపర్‌లేటివ్స్ ఇన్‌కార్పొరేటెడ్ కార్యాలయాన్ని ప్రారంభించారు. పదమూడున్నర వారాల్లో తొలి పుస్తకానికి తుది రూపునిచ్చారు.

♦ 1954లో ఈ విషయం తేల్చేందుకు లండన్‌లో నిజ నిర్ధారణ ఏజెన్సీని నడుపుతున్న కవల సోదరులు నోరీస్, రాస్ మెక్‌వైర్టర్‌ను హ్యూగ్ బీవర్ పిలిపించి రికార్డులను నమోదు చేసే బాధ్యత అప్పగించాడు.

♦ తొలి పుస్తకం 198 పేజీలతో తయారైంది. తొలి ప్రచురణే యూకే బెస్ట్ సెల్లర్‌గా నిలిచిపోయింది. కొన్ని నెలలలోనే 50 వేల ప్రతులు అమ్ముడుబోయాయి.



నోరీస్, రాస్

'గిన్నిస్'కూ రికార్డుంది



♦ 100 దేశాల్లో 37 భాషల్లో పది కోట్ల ప్రతులు అమ్ముడయ్యాయనే లెక్కుంది.

♦ ఇది కేవలం పుస్తకంగానే కాదు టీవీ సిరీస్‌గాను, మ్యూజియాలు గాను విస్తరించింది.

అత్యధిక రికార్డులు కొల్లగొట్టిన వ్యక్తిగా న్యూయార్క్‌కు చెందిన ఆశ్రిత ఫర్మన్ పేరు నమోదైంది. 2009 ఏప్రిల్ వరకు 100 రికార్డుల్ని ఆశ్రిత నెలకొల్పారు.

♦ ఏటా పునశ్చరణ అయ్యే ఈ పుస్తకంలోని ప్రతి రికార్డు నోరీస్, రాస్ మెక్‌వైర్టర్‌లకు గుర్తు ఉండేది. కార్యక్రమాల్లో రికార్డులపై పిల్లలు అడిగే ప్రశ్నలకు టక్కున సమాధానం చెప్పేవారు. 1975లో నోరీస్ హత్యకు గురవడంతో ఆ తర్వాత అలా రికార్డుల గురించి చెప్పే అంకానికి 'నోరీస్ ఆన్ ది స్పాట్' అని పేరు పెట్టి అతడి కృషి గుర్తుండిపోయేలా చేశారు.

♦ అనేక చేతులు మారాక చివరకు గిన్నిస్ రికార్డ్సు 'రిప్లీ ఎంటర్‌టైన్‌మెంట్స్' మాతృసంస్థ జిమ్ పాటిసన్ గ్రూప్ చేతికి వెళ్లింది. అమెరికాలోని ఓర్లాండోలోని రిప్లీ ప్రధాన కార్యాలయంలో గిన్నిస్ మ్యూజియమ్ అట్రాక్షన్స్ కూడా ఉన్నాయి.

హ్యూగ్ బీవర్

♦ 2006న నవంబర్ 9న ఒకేసారి ప్రపంచవ్యాప్తంగా పది దేశాలకు చెందిన లక్ష మంది గిన్నిస్ బుక్‌లో చోటు కోసం కుస్తీలు పడ్డారు.

♦ గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌కే ఓ ఆల్‌టైమ్ వరల్డ్ రికార్డ్ ఉంది. అది కాపీరైట్స్ ఉండి అత్యధికంగా అమ్ముడుబోయిన పుస్తకంగా.

♦ తొలుత మద్యపానం, తిండి పోటీలు కూడా ఉండేవి కానీ కొన్నేళ్ల నుంచి ఆ తరహా పోటీలు నిర్వహించడంలేదు.

♦ గిన్నిస్ పుస్తకాల్లో అన్ని రికార్డులు ప్రచురించలేరు. ఏదైనా రికార్డు కోసం తెలుసుకోవాలంటే లేఖ రాయొచ్చు.



దిగ్భ్రాంతిపరిచే వ్యూహం

ఒక పొగగొట్టం. అక్కడ పనిచేసే కార్మికులు, వాళ్లమీద పెత్తనం సాగించే అధికారులు.. సాధారణ ప్రజల దృష్టిలో ఫ్యాక్టరీ అంటే ఇంతే! శిరంశెట్టి కాంతారావు రచన వ్యూహం చదివిన వారికి ఈ అభిప్రాయం మారిపోవడం ఖాయం. అంతేనా... ఫ్యాక్టరీలో జరిగే రాజకీయాలు, ఎత్తులకు పై ఎత్తులు, అన్నిటికీ మించి నెత్తుటి ధారలు చిందించి ఉత్పత్తి చేసే కార్మికులు, వారి జీవితాలు, మనుగడ కోసం వారు చేసే పోరాటాలు, వాటిని నీరుగార్చడానికి యాజమాన్యాలు చేసే కుటిల విన్యాసాలు, వారికి వంత పాడే దళారీ నాయకులు, ఆ కుట్రలను ఛేదించడానికి ప్రాణాలను సైతం పణంగా పెట్టే కార్మిక నేతలు, నమ్మిన సిద్ధాంతం కోసం ఎంతకైనా తెగించే వారి సాహసం ఇలా ఒకదాని తరువాత ఒకటిగా ఆవిష్కృతమయ్యే యధార్థ జీవన దృశ్యాలు దిగ్భ్రాంతిని కలిగిస్తాయి. పదపద మంటూ అక్షరాల బారుల వెనుక కళ్లను పరుగు పెట్టిస్తాయి. ఆందోళన కలిగిస్తాయి. ఆలోచనలను రేకెత్తిస్తాయి. పేర్వొంచ స్టీల్‌ప్లాంట్ కేంద్రంగా ఈ నవల సాగుతుంది. స్టీల్ ప్లాంటు చూడని , ఫ్యాక్టరీల విషయాలు అంతగా తెలియని వారికి ఇది అక్షరాల మరో లోకపు ప్రయాణమే! దీనికోసం కాంతారావు అధ్యయనం

పుస్తకం : వ్యూహం
రచయిత : శిరంశెట్టి కాంతారావు
వెల : 150/-
పేజీలు : 206
ప్రతులు : ప్రజాశక్తి అన్ని బ్రాంచీల్లో

చేసిన తీరును, ఆ సమాచారాన్ని అత్యంత ఆసక్తికరంగా మలిచిన తీరును కచ్చితంగా అభినందించాల్సిందే. నవల ప్రారంభమే ఒక ప్రమాదంతో మొదలవుతుంది. వైశాఖ మాసం, మిట్ట మధ్యాహ్నం. ఎండ నిప్పులు చెరుగుతున్న సమయం. ముప్పై ఏడు మీటర్ల ఎత్తున కూలింగ్ టవర్ మీద ఐరన్ బీమ్‌ల వేడిని, ఎండను కూడా లెక్క చేయకుండా గాలిలో వేళ్లాడుతూ వెల్డింగ్ చేస్తూ ప్రత్యక్షమవుతారు ఖాసిమ్, రాజులు. వారికి ఏదైనా ప్రమాదం జరిగితే... ఈ ఆలోచన పాఠకులకు వచ్చీ రాగానే ఆ ప్రమాదమూ జరుగుతుంది. అంత ఎత్తు నుండి రాజు బియ్యం మూటలా కిందకి జారిపోతాడు. నిచ్చెన కోసం చేసి ఉంచిన ఐరన్‌రాడ్లు 'ఖస్స్' మంటూ పొట్టలోకి దిగబడుతాయి. రక్తంతోపాటే రాజు ప్రాణవాయువులు కూడా అతణ్ణి వదిలిపెట్టి వెళ్లిపోతాయి. ఆ వెంటనే వర్కర్ల కోపం చల్లార్చడానికి యాజమాన్య వ్యూహం ప్రారంభమవుతుంది. కార్మికులు, వారి తరపున నిజాయితీగా పనిచేసే సంఘం చేసే పోరాటం, యాజమాన్యానికి అమ్ముడుపోయిన నేతలు చేసే కుట్రలు ప్రారంభమవుతాయి. చివరి వరకు కొనసాగుతాయి. అడుగడుగునా ఆ కుట్రలను ఎదుర్కొని అంకితభావంతో పనిచేసే సంఘం, దాని నాయకుల ఆధ్వర్యంలో ఎలా విజయం సాధించారో వ్యూహం నవల కళ్లముందు సాక్షాత్కరింపచేస్తుంది. ప్రభుత్వ రంగ సంస్థలను నీరు గార్చడానికి, వాటిని తమ అంతేదారులకు అప్పగించడానికి ప్రభుత్వం ఒక పథకం ప్రకారం అమలు చేస్తున్న విధానాలు, స్వార్థమే జీవిత సర్వస్వంగా బతికే ఫ్యాక్టరీ అధికారులు దానికి సహకరించే తీరు, కార్మికుల పేరు చెప్పి సొంత ఆస్తులు పోగుచేసుకునే దళారీ నేతల తానా తందానాలూ కనిపిస్తూ వారి నయవంచనను వ్యూహం బట్టబయలు చేస్తుంది. విశాఖపట్నంలో జరిగిన సిపిఎం 21వ మహాసభల సందర్భంగా నిర్వహించిన పోటీల్లో ప్రథమ బహుమతి పొందిన ఈ నవల ఆద్యంతమూ ఏకబిగిన చదివిస్తుంది. రచనలను చిత్రీకరించిన తీరులోనూ రచయిత చూపిన నైపుణ్యమే దీనికి కారణం.

వి. రాజ గోపాల్

చదివించే చిన్ని కథలు

సాహిత్యం రూపురేఖలు మారిపోతున్నాయి. బిజీ జీవితంలో పడి చదివేవారు కూడా ఓపిక తెచ్చుకుని పెద్ద పెద్ద కథలు చదవడం లేదన్న భావనతో తాజాగా వచ్చిన ఒక కథాసంపుటి "క్షణ వీక్షణాలు". ఈ పుస్తకం నిండా వంద పేజీల్లో వంద కథలున్నాయి. రచయిత పాలపర్తి ధనరాజ్ ఈ కథలను ప్రయోగాత్మకంగా రాసినట్లు అన్పిస్తోంది. సమకాలీన సమాజంలోని సంఘటనలే ఈ కథలలో కన్పిస్తాయి. కొన్ని కథలు ఆహ్లాదాన్ని కలిగిస్తాయి. మరి కొన్ని ఆలోచింపజేస్తాయి. ఇంకొన్ని కథలు ఆహా అన్పిస్తాయి. ఈ సంపుటిలో తొలికథ 'అవుట్‌లెట్'తో మొదలౌతుంది. చివరి కథ 'ఒకరికొకరు'. సున్నితమైన సన్నివేశాలకు కథారూపం ఇవ్వడం రచయిత ప్రత్యేకత. పేజీకి



పుస్తకం : క్షణ వీక్షణాలు
రచయిత: పాలపర్తి ధనరాజ్
పేజీలు: 112,
ధర: 100రూ.
ప్రతులకు: పాలపర్తి ధనరాజ్,
70-17ఏ-18/2ఏ,
శశికాంత్ నగర్,
కాకినాడ- 533 103

ఒక కథ చొప్పున గల ఈ పుస్తకంలో కొన్ని కథలు అరపేజీ కూడా దాటకపోవడం విశేషం. కొన్ని కథలు చదివితే ఏదో ఒక జోక్‌కు కథను అల్లినట్లు కూడా అన్పిస్తుంది. ఈ కథల పుస్తకాన్ని చదవాలనుకుంటే మొదటి నుంచే చదవాల్సిన పనిలేదు. ఏపేజీ నుంచి ప్రారంభించినా చదువుకోవచ్చు. అన్నీ విభిన్నమైన అంశాలపై రాసినవి కావడంతో ఆద్యంతమూ ఆసక్తిగా చదివిస్తాయి. పూర్తిగా వాడుకభాషలో, సరళమైన పదాలతో రాసిన ఈ కథలన్నీ పాఠకుడిని హాయిగా చదివిస్తాయి.

కాలక్షేపానికే కాకుండా తొలిసారిగా చిన్న కథలు రాయాలనుకున్నవారికి ఇవి మంచి మార్గదర్శకత్వాన్ని వహించేలా ఉన్నాయి. ఇందులోని కథలు చదివితే రచయిత సునిశిత దృష్టి స్పష్టమౌతుంది. ముఖ్యంగా ప్రయాణాల్లో ఈ పుస్తకాన్ని తమ దగ్గరుంచుకుంటే ప్రయాణపు శ్రమ తెలియకుండా ఈ చిన్నకథల్లో లీనమైపోతారనడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు.

- బెందాళం క్రిష్ణారావు



కకోరి కబాబ్

కావాల్సిన పదార్థాలు

మటన్ (బోన్‌లెస్)- 1/2 కేజీ, పచ్చి బొప్పాయి ముక్కలు-2 టేబుల్ స్పూన్లు
వెన్న-4 టేబుల్ స్పూన్లు
సెనగపిండి -3 టేబుల్ స్పూన్లు
కారం- టేబుల్ స్పూన్
అల్లం వెల్లుల్లి -2 టేబుల్ స్పూన్లు
లవంగాలు-4
ఉప్పు-తగినంత

మసాలా కోసం
మిరియాలు-1 టీస్పూన్
లవంగాలు-4
యాలకులు-4
గసగసాలు- 1టీ స్పూన్
గులాబీ రేకులు- టీ స్పూన్
జీడిపప్పు-10
జాజికాయ-1
ఉల్లిపాయ-1
మిర్చి-10

మసాలా తయారీ

ఉల్లిపాయలు సన్నగా తరిగి దోరగా వేయించాలి. అందులో మిగిలిన మసాలా దినుసులన్నీ వేసి మెత్తగా రుబ్బాలి.

తయారుచేసే విధానం

మటన్ ముక్కల్ని మిక్సీలో వేసి మెత్తగా బ్లెండ్ చేసుకోవాలి. పచ్చి బొప్పాయి ముక్కల్ని కూడా వేసి మెత్తగా పేస్టులా చేయాలి. సెనగపిండిని కొద్దిగా వేయించి మటన్ ముక్కల గుజ్జులో వేసి అల్లం వెల్లుల్లి, కారం, ఉప్పు కూడా వేసి కలపాలి. తర్వాత మసాలా వేసి మరోసారి కలుపుకోవాలి. ఈ మిశ్రమంలో చిన్న రంధ్రాలు చేసి అందులో వెన్న, లవంగాలు ఉంచి మూతపెట్టి సిమ్‌లో ఉడికించాలి.తర్వాత ఈ మిశ్రమాన్ని పదెనిమిది పొడవాటి ఉండలుగా చేసి ఒక గట్టి పుల్లకి చుట్టాలి. వీటిని కాలుతున్న బొగ్గుల మీద గానీ స్టవ్ మీద నేరుగా గానీ కాల్చాలి. మంచి వాసన వస్తుండగా పుల్ల నుంచి వేరుచేసి ఒక ప్లేట్‌లో ఉంచి ఉల్లి తరుగు, నిమ్మకాయ తరుగు, కొత్తిమీరలతో గార్నిష్ చేసి రుచి చూడండి.



చాప్ పలావ్

కావాల్సిన పదార్థాలు

మటన్-కెజి
బాస్మతి బియ్యం-1/2 కెజి
గరంమసాలా- 1/2 టీ స్పూన్
కారం-టీ స్పూన్
ఉప్పు-తగినంత
ఉల్లిపాయలు-అరకిలో
నెయ్యి-200 గ్రాములు
పచ్చిమిర్చి-10
అల్లం-వెల్లుల్లి పేస్ట్-2 టేబుల్ స్పూన్లు
టొమాటో-2
పసుపు-1/2 టీ స్పూను
ధనియాల పొడి-1/2 టీ స్పూన్
కొత్తిమీర తరుగు-2 టేబుల్ స్పూన్లు
అల్లం ముక్కలు-1 టేబుల్ స్పూన్
పుదీనా తురుము-టేబుల్ స్పూన్
వెన్న-2 టేబుల్ స్పూన్లు
మీగడ-4 టేబుల్ స్పూన్లు
గోరువెచ్చని పాలు- 1/2 లీటరు
నిమ్మకాయ-1

తయారుచేసే విధానం

మటన్‌ని శుభ్రంగా కడిగి అంగుళం ముక్కలుగా కోయాలి. బాస్మతి బియ్యం కడిగి నానబెట్టాలి. ఉల్లిపాయల్ని సన్నగా తరిగి ఒక బౌల్‌లో పక్కన పెట్టుకోవాలి. పచ్చిమిర్చి, కొత్తిమీరని కూడా సన్నగా తరిగి పక్కన పెట్టుకోవాలి. మందపాటి బాణలిలో కొద్దిగా నెయ్యి వేసి సన్నగా తరిగిన ఉల్లిముక్కల్ని వేసి వేయించుకోవాలి. పచ్చిమిర్చి, అల్లం, కొత్తిమీర కలిపి పేస్టులా చేసి వేయించిన ఉల్లి తరుగులో వేసి కలుపుకోవాలి. తర్వాత అల్లం వెల్లుల్లి పేస్ట్, పసుపు, కారం, ఉప్పు, జీలకర్ర, ధనియాల పొడి వేసి కలపాలి. అన్నీ వేగాక కొద్దిగా నీరు పోసి మసాలా పొడి వేసి ఉడికుంటుకోవాలి. ఇప్పుడు టమాటా తరుగు, ఉప్పు, గరంమసాలా వేసి మరికొంతసేపు ఉడకనివ్వాలి. ఈ మిశ్రమంలో మటన్ ముక్కలు వేసి కాస్త మెత్తగా ఉడికిన తర్వాత కొద్దిగా నిమ్మరసం వేసి కలపుకోవాలి. మరో గిన్నెలో సరిపడా నీరు పోసి మరిగిన తర్వాత నానబెట్టుకున్న బియ్యం వేసి ఉడికించాలి. అన్న ం సగం ఉడికిన తర్వాత దించి నీళ్లు వంపేయాలి. ఇప్పుడు అన్నాన్ని మటన్ ముక్కల మీద వేసి మీగడ, వెన్న , గరంమసాలా, పుదీనా తరుగు, పచ్చిమిర్చి ముక్కలు వేసి సిమ్‌లో 20 నిమిషాలు దమ్ చేయాలి.

మటన్ డ్రమ్‌స్టిక్స్ దాల్చా

కావాల్సిన పదార్థాలు

మసూర్ దాల్ (కంది పప్పు) -100 గ్రాములు
సెనగపప్పు-50గ్రాములు
ఆవాలు-1 టీస్పూను,
లవంగాలు-4
దాల్చినచెక్క-2
వెల్లుల్లి రేకలు-2
మాంసం- 1కిలో
అల్లం వెల్లుల్లి పేస్ట్-టీ స్పూను,కరివేపాకు-రెండు రెబ్బలు, ఎండుమిర్చి- పది, మునగకాయలు-2
పుదీనా తరుగు-1/2 కప్పు, మామిడికాయ పొడి-2 టీస్పూన్లు
కారం-1టీ స్పూన్
పసుపు-1 టీ స్పూన్
నెయ్యి- 50 గ్రాములు
ఉప్పు-తగినంత
నూనె-సరిపడా

తయారుచేసే విధానం

ఒక పాత్రలో నీరు పోసి అందులో మటన్ ముక్కల్ని ఉడికించాలి. మరో పాత్రలో కందిపప్పు, సెనగ పప్పు వేసి కడిగి ఒక గంటసేపు నాననివ్వాలి. బాణలిలో కొద్దిగా నెయ్యివేసి కాగాక అల్లం వెల్లుల్లి, మటన్ ముక్కలు, నానబెట్టిన పప్పులు, మునగకాయ ముక్కలు వేసి వేయించాలి. మరో బాణలిలో నూనె వేసి జీలకర్ర, ఆవాలు, లవంగాలు, దాల్చిన చెక్క వేయించాక ఉడికించిన మటన్ మిశ్రమాన్ని వేసి కలిపి దించాలి. చివరగా మామిడికాయ పొడి, మిగిలిన నెయ్యి, పుదీనా తరుగుతో గార్నిష్ చేసుకోవాలి.



అతికిద్దాం

చింటూకి ఈ మధ్య అల్లరి మరీ ఎక్కువైపోయింది. జోకర్ బొమ్మ కత్తిరించి అతికించకుండా వెళ్లిపోయాడు. ఇక్కడిచ్చిన బొమ్మ ఆధారంగా మీరు దాన్ని జాగ్రత్తగా అతికించేయండి.



రంగులు అద్దండి



కనిపెట్టండి

ఒక కొలనులో మూడు బాతు పిల్లలు తల్లికి కనిపించకుండా దాక్కున్నాయి. అవెక్కడున్నాయో కనిపెట్టండి.

నీడతో బొమ్మ

పిల్లలూ మీకు బొమ్మలంటే భలే ఇష్టం కదూ! టోపీ పెట్టుకున్న ఒక వ్యక్తి బొమ్మని చేతి వేళ్లతో ఎలా చేయచ్చో ఇక్కడ ఇచ్చాం. చీకటి గదిలో చిన్న వెలుగులో మీరూ ప్రయత్నించండి.

తేడాలు గుర్తించండి

ఈ రెండు బొమ్మల్లో 5 తేడాలు ఉన్నాయి. వాటిని గుర్తించి సున్నాచుట్టేయండి.

భిన్నమైనదేది

ఇక్కడ ఒక్కో వరుసలో ఉన్న సీతాకోకచిలుకల్లో ఒకటి భిన్నంగా ఉంది. అదెక్కడుందో కనిపెట్టి సున్నా చుట్టండి.



నేర్చుకుందాం

పిల్లలూ! మీ కోసం ఆర్టిస్ట్ అంకుల్ ముందుగా చిరుతపులి బొమ్మ గీసుంచాడు. మీరూ జాగ్రత్తగా ప్రయత్నించండి!



వాల్ హ్యాంగింగ్స్

పిల్లలూ! చాలా మంది ఇళ్లలో, షాపుల్లో సీడీలతో అందంగా తయారుచేసిన వస్తువుల్ని ఇంటి ముందు వేలాడదీస్తుంటారు. అవి భలే అందంగా ఉంటాయి కదూ. వాటిని మనింట్లో దొరికే వస్తువులతో ఎలా తయారు చేసుకోవాలో మేం నేర్పిస్తాం. జాగ్రత్తగా నేర్చుకోండే.

కావాల్సిన వస్తువులు

పాత సీడీలు-2, ఊలు దారాలు -నచ్చిన రంగుల్లో, స్కెచ్ పెన్, రంగు రంగుల పూసలు, గమ్.

తయారుచేసే విధానం

ముందుగా పాత సీడీలను తీసుకుని వాటిపై స్కెచ్ పెన్‌తో మధ్య ఉన్న రంధ్రం కంటే కొంచెం పెద్ద వృత్తాలని గీసుకోవాలి. తర్వాత మీకు నచ్చిన రంగు ఊలు దారాన్ని తీసుకుని సీడీ చివర్ల పైనుండి మధ్యకి దారాన్ని తీసి చుడుతూ అన్ని వైపులా పూర్తిచేయాలి. ఇప్పుడు ముందుగా గీసుంచుకున్న వృత్తాల మధ్యలో గమ్‌ని రాసి ఒక్కో వృత్తంలో ఒక్కో రంగు ఊలు దారాన్ని గుండ్రంగా చుట్టుకుంటూ



రావాలి. వీటిలో ఊలుతో చేసిన అల్లికల్ని కూడా అతికించుకోవచ్చు. అన్ని వృత్తాలని దారాలతో నింపిన తర్వాత కొంత సేపు ఆరనివ్వాలి. ఇప్పుడు మరో రంగు దారాన్ని తీసుకుని సమాన భాగాలుగా కత్తిరించి చివర్లను ముడివేసుకోవాలి. ఒక్కో ధారంలో రంగు రంగుల పూసల్ని గుచ్చి సిడి అంచున ఉన్న దారానికి కట్టేయాలి. మరో పొడవాటి దారాన్ని తీసుకుని సీడీ మరో చివర కట్టాలి. ఇప్పుడు రంగు రంగుల ఊలు దారాలతో అలంకరించిన సీడీలను గోడలకి లేదా ఇంటి ముందు వేలాడ తీస్తే అందంగా ఉంటాయి.

పదాలను గుర్తించండి

ఇక్కడ ఉన్న సముద్రపు జీవుల పేర్లను నిలువుగా, అడ్డంగానైనా గుర్తించండి.

DRATINI
JAMES
GLOOM

KOFFING
POLIWHIRL

PARASECT
ODDISH
EKANS



T	D	R	A	T	I	N	I	G
C	S	U	M	J	A	M	L	N
E	E	A	Y	M	O	O	K	I
S	K	T	A	R	O	I	E	F
A	A	J	A	M	E	S	G	F
R	N	T	U	B	A	O	P	O
A	S	H	S	I	D	D	O	K
P	O	L	I	W	H	I	R	L

పదవికాసం - 27

కూర్పు: రావెళ్ల

ఆధారాలు

అడ్డం

1. మొత్తంగా (3)
3. మిన్ను (3)
7. బాగా నలిగిపోవడం (2)
8. భూమి (3)
9. కవిత్వం రాసేవాడు (2)
13. నాగార్జున నటించిన చిత్రం (4)
14. దగ్గు తగ్గించే కాయను బుగ్గన పెట్టుకుంటారు (4)
16. గింజలేని ధాన్యం తాలు వంటిదే (2)
17. మేథమేటిక్స్ (3)
18. ఒక పక్షి (2)
21. జగడం (3)
22 చలన చిత్రం (3)

	1	2			3	4		
5				6				
7			8				9	10
		11				12		
13					14			
				15				
16			17				18	
		19				20		
	21				22			

నిలువు

2. కుత్తుక (2)
4. చెట్టుకు కాసేది పండటానికి ముందుది (2)
5. వంశపారం పర్య లక్షణాలను ఏమంటారు (6)
6. ఇది పట్టిందంటే ఒకటే వాన (3)
10. కోస్తా జిల్లాల్లో రెండవది (6)
11. సంపూర్ణం (3)
12. పాటల్లో పల్లవి తరువాత (3)
15. ముక్కుపుడక (3)
19. జాతిని ఇలా అంటారు (2)
20. కార్యము (2)

సుడోకు

		5	2	8	3			6
			5		9	1		2
		2	4	6			3	8
4			3		2	6	8	5
2								9
8	5	1	9		6			7
9	6			3	8	2		
5		7	1		4			
3			6	2	5	9		

గతవారం జవాబులు

8	4	6	7	9	2	3	1	5
2	1	7	4	3	5	8	9	6
5	9	3	6	8	1	2	7	4
6	5	8	9	1	7	4	2	3
3	7	1	2	4	8	5	6	9
4	2	9	3	5	6	7	8	1
9	6	4	8	7	3	1	5	2
7	3	5	1	2	9	6	4	8
1	8	2	5	6	4	9	3	7

1 అ	ను	2 మ	తి		3 ద	4 ర	ఖా	5 స్తు
ప్రా		జ్ఞ		6 బో		వ్య		మ
7 రా	జీ		8 అ	రు	9 గు		శో	భ
వృ		11 నా	ని		12 ద్ధు	13 ం		శు
	14 హ	నీ				15 క్ష	మా	
16 ర		17 బు	18 కొ		19 బి	లు		20 పం
21 హ	రి		22 మ	23 మ్ము	ట్టి		24 క్రం	చ
దా		25 తో		కొ		26 మా		దా
27 రి	సా	ట	బా		28 తో	ట	కూ	ర

గ్రీకు కలలు, కల్పనలు, జానపద కథలు, పౌరాణిక గాథలకు నెలవైన స్లైక్లేడ్స్ ద్వీప సముదాయంలోని ప్రాచీన తీరానే ఈ సాండొరినీ. ఏగియాన్ సముద్రంలో ఈ అగ్ని పర్వత విస్ఫోటన అవశేషమే... లావా నెర్రెల మధ్య రూపుదిద్దుకున్న ఈ సుందర ప్రాంతమంటే నమ్మబుద్ధి కాదు. గ్రీస్‌కు 200 కి.మీ.ల దూరంలో ఉండే సాండొరినీ 73 చదరపు కి.మీ.లలో విస్తరించి ఉంటుంది. సుమారు 15,500 మంది జనాభా ఉండే ఈ ఊరిని చూస్తే అర్థమవుతోంది కదా పర్యాటకమే వీరి ప్రధాన వృత్తి అని. పర్యాటకులను గాడిదలపై తిప్పి చూపించడం ఇక్కడి ప్రత్యేకత.





జైన్ ఇరిగేషన్ సిస్టమ్స్ లిమిటెడ్

1-1-782/బి/5, పార్క్ ఎదురుగా,కెనరా బ్యాంక్ దగ్గర, గాంధీనగర్, హైదరాబాద్-080
ఆంధ్ర ఫోన్ నెంబర్లు : 9440797807, 9440797881, 9440797840
తెలంగాణ ఫోన్ నెంబర్లు : 9440797846, 9440797816, 9440797825
టోల్ ఫ్రీ : 18005997899, ఈ మెయిల్ : jainhyderabad@jains.com

భారతదేశ స్కూల్స్ చరిత్రలో సంచలనం
2011, 2012, 2013, 2014, 2015,2016 వరుస విజయాల విశ్వభారతి ప్రభంజనం
పొట్లూరి శ్రీమన్నారాయణ
ఛైర్మన్
2011 All India 1
I. Prudhvi Tej
IIT - JEE 2011
2012 State 1
Ch. Nitish Chandra
EAMCET - 2012
2013 All India 1
P. Sai Sandeep Reddy
IIT - JEE 2013 & EAMCET - 2013
2016 All India 8
S.Sai Praneeth Reddy
IIT - JEE 2016
2015 State 2
D. AKSHITH REDDY
EAMCET - 2015
State 3
V. ANOOHYA
EAMCET - 2015
State 4
G. JAYA HARISH
EAMCET - 2015
2016 State 2
160
160
S. Pratyusha
Medical - 2016
2012 All India 8
T. Bhargav Reddy
IIT - JEE 2011
2012 All India 4
P. Balaji Vishal
IIT - JEE 2012
All India 5
D. Venkatesh
IIT - JEE 2012
2014 All India 2
R. Abhinav
IIT - JEE 2014
All India 4
R. Lohith
IIT - JEE 2014
49
Years of
Academic Excellence
విశ్వభారతి
ఇంగ్లీషు మీడియం హైస్కూల్
గుడివాడ - 521 301, కృష్ణాజిల్లా. ఆంధ్రప్రదేశ్
e-mail : viswabharati@yahoo.com ; Website : viswabharati.org
08674 - 249292
246969
Cell : 9848134850

26

Check List

Book Number	KNSR02B134	Date	03/09/22
Front Cover	yes	Back Cover	yes
Blank Pages	NO		
Missing Pages	NO		
Prepared By	Mounika	Cutting By	Mounika
Scanned By	Shameera	Pages	29